ప్రజాశక్తి

సోమవారం 12 డిసెంబర్ 2022 8 పేజీలు



ప్రకాశం



బాపట్ల

వర్షార్పణం



బాపట్ల జిల్లా, నగరంలో వర్షపు నీటిలో వరి ఓదెలు

- నీట మునిగిన పంటలు..
- వరితో పాటు మిర్చి, పొగాకు పంటలకు భారీ నష్టం
- రైతులకు కోలుకోలేని దెబ్బ
- వర్షానికి మొలకెత్తిన బొబ్బర్లు.. కుళ్లిన పొగనాట్లు

ప్రజాశక్తి-ఒంగోలు బ్యూరో, బాపట్ల జిల్లా

తుపాను పంటలను నిండా ముంచేసింది. రైతులను కోలుకోలేని దెబ్బ తీసింది. చేతికి అందే దశలో భారీ వర్షాలకు పంటలు పూర్తిగా నీటమునిగాయి. ఏ పంటకూ ఈ వర్షం వల్ల లాభం లేకపోగా అన్ని రకాలుగా కీడే చేసింది. ఎక్కడ చూసినా పంటలన్నీ నీటిలో ఉన్నాయి. ముఖ్యంగా వరికి ఈ వర్షం తీరని నష్టం మిగిల్చింది.. కోసిన వరి ఓదెలు నీటిలో తేలాడుతున్నాయి. బాపట్ల జిల్లాలో ఎక్కువగా వరి పంట దెబ్బతినింది. పత్తి, మినుము పంటలు కూడా దెబ్బతిన్నాయి. ప్రకాశం జిల్లాలో వరితో పాటు మినుము, బొబ్బర్లు, పత్తి, మిర్చి పంటకు నష్టం వాటిల్లింది. ▶ 2లో



కొల్లూరులో తడిసిన వరిని చూపిస్తున్న రైతు



దర్శి మండలం, తూర్పు వెంకటాపురం వద్ద వాగులో చిక్కుకున్న కారు



పెద్దదోర్నాలలో వర్షపునీటిలో మిర్చి పంట



శింగరాయకొండలో నీటమునిగిన మినుము

ఫ్యాక్టరీలో అగ్నిప్రమాదం

- గ్రోత్‌సెంటర్‌లోని కెమికల్స్ పరిశ్రమలో మంటలు..
- రూ.40 లక్షల ఆస్తి నష్టం

ప్రజాశక్తి-గ్రోత్ సెంటర్ (మద్దిపాడు)

విద్యుత్ షార్ట్‌సర్క్యూట్ కారణంగా మద్దిపాడు మండలం, గ్రోత్‌సెంటర్ లోని కెమికల్ ఫ్యాక్టరీలో మంటలు చెలరేగడంతో రూ.40 లక్షల ఆస్తి నష్టం వాటిల్లిన ఘటన ఆదివారం చోటుచేసు కుంది. ఎస్సై శ్రీరామ్ తెలిపిన వివరాల ప్రకారం.. కొంతకాలం నుండి ప్రసాద్ ఆర్గానిక్స్ అనే కెమికల్ ఫ్యాక్టరీలో పెర్‌ఫ్యూమ్స్ తయారుచేస్తున్నారు. ఉదయం ఆరు గంటల సమయంలో కార్మికులు విధులు నిర్వహిస్తుండగానే.. ఫ్యాక్టరీలో విద్యుత్ షార్ట్‌సర్క్యూట్ కార ణంగా ఒక్కసారిగా మంటలు చెలరేగాయి. భారీఎత్తున మంటలు చెలరేగాయి. ఇది గమనించిన కార్మికులందరూ హుటాహుటిన బయటకు పరుగులు తీశారు. సమాచారం అందుకున్న ఫైర్ సిబ్బంది హుటాహుటిన సంఘటనాస్థలానికి ఒంగోలు, అద్దంకి నుంచి రెండు ఫైర్ ఇంజిన్లతో మంటలను ఆర్పేందుకు తీవ్రంగా ప్రయత్నించారు. మధ్యాహ్నం 12.30కు మంటలు అదుపులోకి వచ్చారు.



అగ్నిప్రమాదం సంభవించిన ఫ్యాక్టరీ

ఈ ప్రమాదంలో ఫ్యాక్టరీలోని ఖరీదైన మిషనరీ, పెర్ఫ్యూమ్‌కి ఉపయోగించే ద్రావణం పూర్తిగా అగ్నికి ఆహుతయ్యాయి. దాదాపు రూ.40 లక్షల ఆస్తి నష్టం వాటిల్లినట్లు అధికారులు అంచనా వేశారు. ఈ ఘటనలో ఎటువంటి ప్రాణ నష్టం జరగక పోవడంతో అందరూ ఊపిరిపీల్చుకున్నారు. పోలీసులు ఘటనా స్థలాన్ని పరిశీలించారు. కేసు దర్యాప్తు చేస్తున్నారు.

మత్స్యకారులు క్షేమం..

- కొత్తపట్నం తీరం వద్ద ఒడ్డుకు చేరిన జాలర్లు
- వైద్యపరీక్షలు చేయించి.. ఇంటికి పంపిన అధికారులు

ప్రజాశక్తి-కొత్తపట్నం

సముద్రంలో చిక్కుకున్న ఏడుగురు మత్స్యకారులను అధికారులు ఆదివారం ఉదయం కొత్తపట్నం తీరం వద్ద ఒడ్డుకు తీసుకొచ్చారు. బాపట్ల జిల్లా, చీరాల మండలం, వాడరేవు గ్రామానికి చెందిన ఏడుగురు మత్స్యకారులు వేటకు వెళ్లి సముద్రంలో చిక్కుకున్న విషయం తెలిసిందే.. మత్స్యకారులు క్షేమంగా రావడంతో బంధువులు, అధికారులు ఊపిరి పీల్చుకున్నారు.



క్షేమంగా ఒడ్డుకు చేరిన మత్స్యకారులతో పోలీసులు

ఈ నెల నాలుగో తేదీన వాడరేవు గ్రామా నికి చెందిన గరికన కృష్ణకు చెందిన మర బోటులో అతనితో పాటు మెరుగ ప్రసాద్, శివ, దాసరి పంపోచి, పొక్కల మహేష్, వంగిరి మల్లి, మరద పౌల్ సముద్రంలో వేటకు వెళ్లారు. వీళ్లు వెళ్లిన రెండు రోజుల తర్వాత బంగాళాఖాతంలో ఏర్పడిన తుఫాన్ ఏర్పడిన విషయం తెలిసింది. అప్పటికే సముద్రంలో తుపాను ప్రభావం కనిపించింది. వారు ఒడ్డుకు చేరే ప్రయత్నం చేస్తుండగా అలల ఉద్ధతి కార ణంగా ఒడ్డుకు చేరుకోలేకపోయారు. తొలుత శింగరాయకొండ మండలం, ఊళ్ళపాలెంలో తీరం వద్దకు చేరడానికి ప్రయత్నం చేశారు. కానీ సముద్రంలో భారీవర్షం, అలల ఉధృతి ఎక్కువగా ఉండడంతో అక్కడికి కూడా చేరుకోలేకపోయారు. అప్పటికే బోటులో ఉన్న రెండు ఇంజిన్లలో ఒకటి చెడిపోయింది. తర్వాత కొత్తపట్నం వైపు వస్తుండగా రెండో ఇంజన్ కూడా చెడిపోయింది. విషయాన్ని మత్స్య కారులు ఫోన్లతో ఎప్పటికప్పుడు అధికారులకు చేరవేస్తున్నారు. శనివారం రాత్రి కొత్తపట్నం తీరం వద్ద బోటును లంగరు వేసి.. నిలుపుదల చేశారు. వీరిని ఆ సమయంలో ఒడ్డుకు తీసు కొచ్చేందుకు అధికారులు ప్రయత్నం చేసినా.. వాతావరణం సహకరించలేదు. దీంతో అధి కారులు రాత్రంతా సముద్రపు ఒడ్డున ఉండి పర్యవేక్షిస్తూ.. వారితో ఫోన్లో మాట్లాడుతూ.. ధైర్యాన్ని నింపారు. ప్రత్యేక బోటు సహాయంతో ఆదివారం ఉదయం ఏడు గంటల సమ యంలో మత్స్యకారులను స్థానికులు, గజ ఈతగాళ్లు, లైఫ్ జాకెట్లు సహాయంతో సురక్షితంగా ఒడ్డుకు తీసుకొచ్చారు. అనంతరం కొత్తపట్నం ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి తీసుకెళ్లి.. వారికి వైద్యపరీక్షలు చేయించారు. అందరూ క్షేమంగా ఉండడంతో వారిని వాడరేవుకు పంపించారు.


వర్షార్పణం

(మొదటిపేజీ తరువాయి)

ప్రకాశం జిల్లాలో సుమారు 27,550 ఎకరాలలో వివిధ పంటలు దెబ్బతిన్నట్లు వ్యవసాధికారులు ప్రాథమిక అంచనా వేశారు. త్రిపురాంతకం, దర్శి, తాళ్లూరు మండలాల్లో వరికి బాగా నష్టం జరిగింది. వరి ధాన్యం తడిచింది. రంగు మారుతుంది. రైతులు పొలాలను చూసి లబోదిబోమంటున్నారు. పశ్చిమాన దోర్నాల, పెద్దారవీడు ప్రాంతాల్లో మిర్చితోటల్లో నీరు చేరింది. కాయలు కూడా రాలిపోయాయి. పూర్తిగా తడిచిపోయాయి. పశ్చిమ ప్రాంతంలో మిర్చికిబాగా నష్టం జరిగింది. కొనకొనమిట్ల మండలంలో ఎక్కువగా బొబ్బర్లు సాగు చేశారు. కాయలు తడిచి గింజలు మొలకెత్తాయి. ఎందుకూ పనికిరాకుండా పోయాయి. చేతికందే దశలో ఈ వర్షం పప్పుధాన్యాలను నాశనం చేసిందని రైతులు వాపోతున్నారు. కోస్తా ప్రాంతంలో మిర్చితో పాటు పొగాకుకు బాగా నష్టం జరిగింది. శింగరాయకొండ,కొండపి, టంగుటూరు, నాగులుప్పలపాడు ప్రాంతాల్లో పొగాకు తోటలు బాగా దెబ్బతిన్నాయి. మొక్కలు కుళ్లిపోతున్నాయి. మళ్లీ నాట్లు వేసుకోవాల్సిందే. దర్శి ప్రాంతంలో బర్లీ పొగాకు పందిళ్లు తడిచిపోయాయి. మినుము పంట కూడా వేలాది ఎకరాల్లో పోయింది. ఇది కూడా బొబ్బర్ల మాదిరిగానే కాయలు తడిచి మొలకెత్తుతున్నాయి. మూడు రోజులుగా ఎడతెరిపి లేకుండా వర్షం కురుస్తోంది. జిల్లాలో అన్ని ప్రాంతాల్లో భారీగానే వర్షపాతం నమోదైంది. వ్యవసాయశాఖ కూడా పూర్తిగా అంచనాలు వేయలేదు. వర్షాలు పడుతున్నందున ఎక్కడ ఏఏ పంటలు దెబ్బతిన్నాయనేదీ గుర్తిస్తున్నారు. జిల్లాఅంతటా వర్షం ఉన్నందున అన్ని పంటలకూ నష్టం జరిగింది. రెండు రోజుల్లోనే జిల్లావ్యాప్తంగా 3228.8 మి.మీ.లు వర్షపాతం నమోదైంది. జిల్లా సగటు రెండు రోజుల్లో 85.0 మి.మీ.ల వర్షం కురిసింది. పీసీపల్లిలో అత్యధికంగా రెండు రోజుల్లోనే 180.8 మి.మీలు వర్షపాతం నమోదైంది. 13 మండలాల్లో రెండు రోజుల్లో 100 మి.మీ. లకు పైగా వర్షం కురిసింది. ఆది వారం నాడు కూడా జిల్లాలో వర్షాలు కురుస్తూనే ఉన్నాయి. తుపాను తీరం దాటాక పరిస్థితి ఆందోళనగా మారింది. వర్షాలు పెరిగాయి. దీంతో పంటలన్నీ నీటిలో తేలాడుతున్నాయి. రూ.కోట్లలోనే నష్టం ఉంటుందని తెలుస్తోంది. వర్షం ఇంకా వీడలేదు. పొలాల్లో రైతులు కూడా అడుగుపెట్టే పరిస్థితి లేదు.

70 వేల ఎకరాల్లో మునిగిన వరి

తుపాను ప్రభావంతో కరుస్తున్న భారీ వర్షాల కారణంగా బాపట్ల జిల్లాలోని వరి రైతులు తీవ్రంగా నష్టపోతున్నారు. ప్రధానంగా జిల్లాలో కృష్టా పశ్చిమ డెల్టా కింద రేపల్లె, బాపట్ల వ్యవసాయ సబ్‌డివిజన్ల పరిధిలో సాగుచేసిన వరి పైరు కోతకు వచ్చింది. డిసెంబరు మొదటి వారం నుంచి రైతులు వరి కోతలు ప్రారంభించారు. కోతల సమయంలో వచ్చిన మాండోస్ తుఫాను ప్రభావంతో వేలాది ఎకరాల్లో చేతికొచ్చిన వరి పైరు రైతు నుంచి చేజారిపోయే పరిస్థితి తలెత్తింది. జిల్లాలో మొత్తంగా రెండు లక్షలా 30 వేల ఎకరాల్లో రైతులు వరిసాగు చేశారు. ఇందులో రేపల్లె, బాపట్ల డివిజన్ల పరిధిలో వర్షాలకు ముందు 30 వేల ఎకరాల్లో వరి పంట కోతలు కోసి ఓదెల మీద ఉంది. తక్కువ మంది మాత్రమే పొలాల్లోనే కుప్పలు వేశారు. అధిక భాగం వరి కోసి పొలంలోనే పరిచి ఉంది. వర్షాలకు ఈ పంట అంతా నీట మునిగింది. లోతట్టు మాగాణి భూముల్లో కోసిన వరి పంట



చీమకుర్తిలో గ్రానైట్ గనుల్లో నిలిచిన వర్షపునీరు

నీటిపై తేలియాడుతోంది. మరో 40 వేల ఎకరాల్లో వరి పైరు వర్షం, గాలులకు పొలంలోనే ఒరిగిపోయింది. పొలాల్లో వర్షపు నీరు చేరడంతో ఆ వరి పైర్లన్నీ నీటిలోనే ఉండిపోయాయి. చాలా ప్రాంతాల్లో మురుగునీటి పారుదల వ్యవస్థ సక్రమంగా లేకపోవడంతో వరదనీరు త్వరితంగా బయటకు వెళ్లే వీలులేకపోయింది. మురుగు కాలువల్లో సంవత్సరాలుగా పూడికలు తీయలేదు. గుర్రపుడెక్క బాగా పెరిగిపోయి నీటి ప్రవాహానికి అడ్డుగా ఉండటంతో వరద నీరు వేగంగా దిగువకు వెళ్లే వీలులేకపోతోంది. ఈ కారణంగా కోతకు వచ్చి పొలంలో ఒరిగిన వరి పైరు అంతా అలాగే వరదనీటిలో ఉండి పోయింది. తుపాను ప్రభావంతో మరి కొన్ని రోజులు వర్షాలు పడితే రేపల్లె, బాపట్ల ప్రాంతాల్లోనే లక్ష ఎకరాల్లో వరి పైరును రైతాంగం కోల్పోయే పరిస్థితి ఉంది. గడచిన రెండేళ్లుగా వరి కోతల సమయంలోనే డిసెంబరు నెలలో సంభవించిన తుఫాను కారణంగా రైతులు తీవ్రంగా నష్టపోయారు. ఈ ఏడాది కూడా కోతల సమయంలోనే వర్షాలు రావడంతో వరి రైతులు తీవ్రంగా నష్టపోయారు. వరితో పాటు జిల్లాలో పత్తి, మినుము, కొంతమేర మిర్చి పంటకు నష్టం వాటిల్లనుంది. కృష్ణా నది పరివాహక ప్రాంతంలో సాగు చేసిన పసుపు, ఉద్యాప పంటలకు కూడా తుఫాను కారణంగా నష్టం జరిగింది. పర్చూరు డివిజన్‌లో ఖరీఫ్‌లో సాగు చేసిన కాయ పగిలిన దశలో ఉన్న పత్తి, పూత దశలో ఉన్న మిర్చి పంటకు కొంత మేర నష్టం వాటిల్లనుంది.

27,550 ఎకరాల్లో దెబ్బతిన్న పంటలు

ఒంగోలు కలెక్టరేట్: జిల్లాలోని 10 మండలాల్లోని 121 గ్రామాలలో రైతులు సాగు చేసిన పంటలు దెబ్బతిన్నాయి. సుమారు 27,550 ఎకరాలలో వివిధ పంటలు దెబ్బతిన్నట్లు వ్యవసాయ అధికారులు ప్రాథమికంగా అంచనా వేశారు. వీటిలో శనగ 10,533 ఎకరాలు, పొగాకు 5987 ఎకరాలు, మినుములు 8101 ఎకరాలు, మొక్కజొన్న 78 ఎకరాలు, వరి 37 ఎకరాలు, పెసలు 2 ఎకరాలలో దెబ్బతిన్నట్లు అంచనా వేశారు.



వాల్‌పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న ఎస్‌ఎఫ్‌ఐ నాయకులు

ఎస్‌ఎఫ్‌ఐ మహాసభలను జయప్రదం చేయండి

ప్రజాశక్తి-ఒంగోలు కలెక్టరేట్

భారత విద్యార్థి ఫెడరేషన్(ఎస్‌ఎఫ్‌ఐ) అఖిల భారత మహాసభలు ఈ నెల 13, 14, 15, 16 తేదీలలో హైదరాబాద్ ఉస్మానియా యూనివర్సిటీలో జరగనున్నాయని, వీటిని మహాసభలను జయప్రదం చేయాలని ఎస్ ఎఫ్ఐ రాష్ట్ర, జిల్లా నాయకులు కోరారు. స్థానిక ఎస్‌ఎఫ్‌ఐ జిల్లా కార్యాలయంలో గోడ పత్రికను ఎస్‌ఎఫ్‌ఐ రాష్ట్ర ఉపాధ్యక్షులు టి.రాజా, జిల్లా కార్యదర్శి సిహెచ్ వినోద్, రాష్ట్ర కమిటీ సభ్యులు కుసుమ ఆవిష్కరించారు..ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఈనెల 13వ తేదీన హైదరాబాద్ నగరంలో వేలాది మంది విద్యార్థులతో ర్యాలీ బహిరంగ సభ జరగనుందన్నారు. బహిరంగ సభలో త్రిపుర మాజీ ముఖ్యమంత్రి మాణిక్ సర్కార్, జెఎన్‌యు మాజీ విద్యార్థి సీతారాం ఏచూరి, వివిధ రాష్ట్రాల ప్రతినిధులు హాజరయ్యి ప్రసంగిస్తారన్నారు. అనంతరం జరిగే ప్రతినిధుల సభలో విద్యారంగ సమస్యలపై చర్చించి భవిష్యత్తు కార్యాచరణ తీసుకోవడం జరుగుతుందన్నారు. మహాసభలను జయప్రదం చేయాలని విద్యార్థి లోకానికి వారు పిలుపునిచ్చారు. కార్యక్రమంలో జిల్లా ఉపాధ్యక్షులు ప్రవీణ్, నగర అధ్యక్షులు సశాంత్, ఉపాధ్యక్షులు వెంకటేష్, నగర నాయకులు పాల్గొన్నారు.

చిత్తడిగా మారిన శివారు కాలనీలు

ప్రజాశక్తి-ఒంగోలు సబర్బన్

తుఫాన్ కారణంగా గత మూడు రోజులుగా కురుస్తున్న వర్షానికి నగరంలోని శివారు కాలనీలు చిత్తడిచిత్తడిగా మారాయి. శివారు కాలనీలుగా ఉన్న రాజీవ్‌గృహకల్ప, ఇందిరమ్మ కాలనీ, గుర్రం జాషువా కాలనీ, అరవకాలనీ, పోతురాజుపాలెం, తుఫాన్ కాలనీ, కేశవరాజుకుంట, భరత్‌నగర్, భగత్‌సింగ్ కాలనీ, శ్రీనివాసకాలనీ, యానాది సంఘం, వెంకటేశ్వరకాలనీ, ప్రాంతాల్లో మట్టిరోడ్లపై వర్షపునీరు చేరి ప్రజల రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. పోతురాజు కాలువ పరివాహక ప్రాంతాల్లో ఉన్న నెహ్రూనగర్, బిలాల్‌నగర్, పాపాకాలనీ, కరుణాకాలనీ, గోపాలనగర్, ఇందుర్తినగర్ ప్రాంతాలలోని పలు ఇళ్లలోకి నీరు చేరింది. కల్వరి టెంపుల్ వద్ద జాతీయరహదారిపై నీరు చేరి చెరువును తలపించింది. నగరంలోని రోడ్లపై నిలిచిన నీరు నిల్వ ఉండకుండా కాల్వల ద్వారా బయటకు పంపేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు నగరపాలక సంస్థ కమిషనర్ ఎం వెంకటేశ్వరరావు తెలిపారు. వర్షపు ప్రభావిత ప్రాంతాలలో ఆదివారం ఆయన విస్తృతంగా పర్యటించారు. అంబేద్కర్ విగ్రహం జంక్షన్, గాంధీరోడ్డు, దక్షిణం బజారు, ఆర్టీసి బస్టాండ్, దేవుడుచెరువు, పేర్నమిట్ట ప్రాంతాలలో ఆయన పర్యటించారు. పారిశుధ్య పనులు చేయించారు. కమిషనర్ వెంట డిప్యూటి మేయర్ వేమూరి బుజ్జి, శానిటరి సూపర్ వైజర్ ఎన్ పిచ్చయ్య, ఇన్స్‌పెక్టర్ షేక్ బాబ్జీ, డిప్యూటి ఎగ్జికూటివ్ ఇంజినీర్ పద్మజా, గణపతి, ఉన్నారు.

పర్యటించిన కమిషనర్ వెంకటేశ్వరరావు



పారిశుధ్య పనులు చేయిస్తున్న కమిషనర్



కల్వరి టెంపుల్ వద్ద చెరువును తలపిస్తున్న రోడ్డు



ప్రమాణస్వీకారం చేస్తున్న నూతన కార్యవర్గం

ఎపి ఎన్‌జిఒ మార్కాపురం అధ్యక్షులుగా శ్రీనివాసరావు

ప్రజాశక్తి-మార్కాపురం

'ఎపి నాన్ గజిటెడ్ ఆఫీసర్స్ అసోసియేషన్' (ఎన్‌జిఒ) మార్కాపురం తాలూకా నూతన కమిటీ ఎన్నిక స్థానిక ఎన్‌జిఒ హోంలో ఆదివారం జరిగింది. అధ్యక్షులుగా తెల్లమేకల శ్రీనివాసరావు, ప్రధాన కార్యదర్శిగా వడ్లమాని శ్రీనివాస్, అసోసియేటెడ్ అధ్యక్షులుగా ఎం.రవిచంద్ర, ఉపాధ్యక్షులుగా వై.రమేష్‌రెడ్డి, సిహెచ్.రామచంద్రారెడ్డి, వి.బాలవిజయకుమారి, కె.శ్రీనివాసరావు, సహాయ కార్యదర్శులుగా వి.అంజయ్య, జి.సరస్వతి, సిహెచ్.వేణుగోపాలరెడ్డి, ఆర్‌వి.సుబ్బారావు, మహిళల విభాగం నుండి జె.విజయలక్ష్మి, సహాయ కార్యదర్శిగా, కోశాధికారిగా జె.రవికిరణ్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు.

यूनियन बैंक ऑफ इंडिया — యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా
भारत सरकार का उपक्रम A Government of India Undertaking (భారత ప్రభుత్వ రంగ సంస్థ)
आन्ध्रा Andhra — कार्पोरेशन Corporation
అస్సెట్ రికవరీ బ్రాంచి (79170), విజయవాడ. ఆచార్య నాగార్జున యూనివర్సిటీ క్యాంపస్, గుంటూరు, ఆంధ్రప్రదేశ్ - 522510
E-mail: arb.vijayawada@unionbankofindia.bank

ఈ-వేలం అమ్మకం ప్రకటన

సెక్యూరిటైజేషన్ మరియు రీ కన్‌స్ట్రక్షన్ ఆఫ్ ఫైనాన్షియల్ అస్సెట్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫ్ సెక్యూరిటీ ఇంటరెస్ట్ చట్టం, 2002 ప్రకారం పూర్వపు ఆంధ్రాబ్యాంక్ / కార్పోరేషన్ బ్యాంక్ ఇప్పుడు యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, ఇప్పుడు ఈ ఖాతాలు అస్సెట్‌ని రికవరీ బ్రాంచి, విజయవాడ కు బదలాయించబడినది, ఆధీకృత అధికారిగా దిగువ సంతకందారు సదరు చట్టం నందలి రూలు 8(6) ప్రకారం సంక్రమించిన అధికారాలను వినియోగిస్తూ సాధారణ ప్రజానీకమునకు ముఖ్యంగా ఋణగ్రహీతలకు నోటీసు ఇచ్చి తెలియజేయునదిఏమనగా బ్యాంకు వారు దిగువ పేర్కొన్న బకాయిలను, తదుపరి వడ్డీ, ఛార్జీలు మొ॥నవి తిరిగి రాబట్టుకొనుటకు వారికి హామీగా ఉంచి, స్వాధీనత చేసుకోబడిన స్థిరాస్తులను క్రింద సూచించిన విధముగా ఇ-వేలం ద్వారా బ్యాంకు వారిచే అమ్ముటకు నిర్ణయించడమైనది. దిగువ స్థిరాస్తి **అమ్మకం "ఎక్కడ ఏది ఉన్నదో, అది, ఎలా ఉన్నదో అలా మరియు అక్కడ ఏది ఉంటే అది"** ప్రాతిపదిన దిగువ పేర్కొనబడిన ఋణగ్రహీతలకు మరియు హామీదారుల నుండి రావలసిన **బకాయి మొత్తము** కాంట్రాక్ట్యువల్ రేటు ప్రకారం తదుపరి వడ్డీ మరియు ఇతర ఖర్చులతో రాబట్టుకొనేందుకు **యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, అస్సెట్ రికవరీ బ్రాంచి, విజయవాడ వారిచే** ఇ-వేలం అమ్మకం ద్వారా **ది. 28-12-2022**న ఆస్తులను విక్రయించేందుకు నిర్ణయించడమైనది. **బిడ్లు సమర్పించుటకు ఆఖరుతేది, రిజర్వు ధర, ధరావత్తు మొత్తము ఈ క్రింది విధముగా ఉన్నవి.**

1) ఋణగ్రహీతలు / కో ఆబ్లిగెంట్స్ / తనఖాదారులు / హామీదారులు : 1) మెస్సర్స్ రవిచంద్ర కాటన్ ట్రేడర్స్, ప్రొ॥ శ్రీ దామర్ల రాధాకృష్ణ, డి.నెం. 6-115, జిటి రోడ్డు, చిలకలూరిపేట, గుంటూరు జిల్లా (ఋణగ్రహీత). 2) శ్రీమతి దామర్ల సుబ్బాయమ్మ, భర్త : శ్రీ రాధాకృష్ణ, డి.నెం. 6-115, జిటి రోడ్డు, చిలకలూరిపేట, గుంటూరు జిల్లా (హామీదారు)

బకాయి మొత్తం : ది. 31-03-2020 నాటికి రూ. 2,17,31,000/- (అక్షరాలా రెండు కోట్ల పదిహేడు లక్షల ముప్పై ఒక్క వేయి మాత్రమే) మరియు ది. 01-04-2020 నుండి కాంట్రాక్ట్యువల్ రేటు ప్రకారం తదుపరి వడ్డీ మరియు ఇతర ఖర్చులు.

ఆస్తి వివరములు : ఆస్తి నెం. 1 : శ్రీమతి దామర్ల సుబ్బాయమ్మ, తండ్రి : శ్రీ దామర్ల రాధాకృష్ణ గారి పేరిట ప్రకాశం జిల్లా, మార్టూరు సబ్ డిస్ట్రిక్ట్, ఒంగోలు రిజిస్ట్రేషన్ జిల్లా, మార్టూరు గ్రామ పంచాయితీ, మార్టూరు మండలం, మార్టూరు గ్రామం, డోర్ నెం. 6-10-6010/ఏ, డి.నెం. 608/ఏసి1 వద్ద 273 చ॥గ॥లు (250 చ॥గ॥లు మాత్రమే వాల్యూయేషన్ కోసం పరిగణించబడును) విస్తీర్ణంలోని నివాస భూమి అందలి ఆర్‌సిసి రూఫ్ నివాస గ్రౌండ్ ఫ్లోర్ బిల్డింగ్. **హద్దులు : తూర్పు :** కొత్తపల్లి మహాలక్ష్మమ్మ గారి స్థలము, **దక్షిణం :** దాసరి విజయలక్ష్మి గారి స్థలము, **పడమర :** దారి కొరకు 16 అ॥ వెడల్పు గల బజారు, **ఉత్తరం :** కోటేశ్వరరావు గారికి చెందిన సబ్జెక్టు ప్రాపర్టీ సైటుకు ఆనుకుని 2 అ॥ వెడల్పుగల స్థలం. రిజిస్టర్డ్ డాక్యుమెంట్ నెం. 48/2008, తేది : 11-01-2008

రిజర్వు ధర : రూ. 25,00,000/- ధరావత్తు : రూ. 2,50,000/- బిడ్ పెంపుదల మొత్తం : రూ. 10,000/-

వేలం అమ్మకం యొక్క వివరణాత్మక నిబంధనలు మరియు షరతుల కోసం **https://www.ibapi.in మరియు యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా** వెబ్ సైట్ : **www. unionbankofindia.co.in** నందు చూడగలరు. అధీకృత అధికారి / ఛీఫ్ మేనేజర్ గారికి తెలిసిన సమాచారము ప్రకారం స్థిరాస్తిపై ఎటువంటి ఎన్‌కంబ్రెన్స్ లేదు, ఆసక్తిగల బిడ్డర్లు ఆస్తి పరిశీలన కోసం **Mail ID:arb.vijayawada@unionbankofindia.bank**లలో సంప్రదించవచ్చు.

సెక్యూరిటీ ఇంటరెస్ట్ (ఎన్‌ఫోర్స్‌మెంట్) రూల్ 2002 లోని రూలు 8(6)/ రూలు 9(1) అనుసరించి చట్టబద్ధమైన 15 రోజుల అమ్మకం నోటీసు

చెల్లించవలసిన బకాయిలను పూర్తిగా చెల్లించని సందర్భంలో పైన తెలిపిన తేదీన ఈ-వేలం అమ్మకం నిర్వహణ గురించి సదరు ఋణం తీసుకున్న ఋణగ్రహీత / సహాబాధ్యతగల వారికి సెక్యూరిటీ ఇంటరెస్ట్ (ఎన్‌ఫోర్స్‌మెంట్) రూల్స్ 2002లోని 8(6) రూలు 9(1) క్రింద దీనిని నోటీసుగా పరిగణించవలెను.

తేది : 09-12-2022
ప్రదేశం : ANU క్యాంపస్, గుంటూరు

ఛీఫ్ మేనేజర్ & అధీకృత అధికారి, యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, అస్సెట్ రికవరీ బ్రాంచి, విజయవాడ

దావా సమను
మహారాజశ్రీ పర్చూరు జూనియర్ సివిల్ జడ్జి వారి కోర్టులో
OS.No: 164/2022

Between:-
శ్రీమతి శానంపూడి లక్ష్మీ త్రివేణి ....వాది
మరియు.
ఆత్మకూరి రమేష్ వగైరాలు ...**ప్రతివాదులు**
To
1.ఆత్మకూరి రమేష్ S/o లేటు పున్నయ్య
2.ఆత్మకూరి తరుణ్) రి.బై గార్డియన్
Alleged father ఆత్మకూరి రమేష్
S/O. లేటు పున్నయ్య
3.ఆత్మకూరి రమాదేవి W/o సుబ్బారావు
All are Residing at నాగండ్ల,
ఇంకొల్లు మండలం, బాపట్ల జిల్లా.

పై నంబరు గల దావాను మీపై దాఖలు చేసి మీకు ఎన్నిమార్లు దావా సమన్లు పంపిననూ చేరనందున ఈ ప్రకటన ద్వారా మీకు తెలియ జేయునది ఏమనగా ది. 20-12-2022న ఉ. 10-30 ని.లకు వాయిదా ఉన్నందున మీరు స్వయముగా గానీ వకీలు గారిద్వారా గాని పై కోర్టు వారి ఎదుట హాజరయి మీ ఆక్షేపణలు తెలుపుకొనవలసినది. లేని ఎ డల మీ పరోక్షమునందు దావాను విచారించి తీర్మానించబడును.

(కోర్టు వారి అనుమతితో)
వాయిదా తేది :- 20-12-2022.

రావి సత్యనారాయణ
రావి శ్రీనివాసరావు
CH. శ్రీ రమణి
న్యాయవాదులు, పర్చూరు.

దావా సమను
మహారాజశ్రీ పర్చూరు జూనియర్ సివిల్ జడ్జి వారి కోర్టులో
OS.No: 267/2022

Between:-
ఆరుమూరి జ్యోతి ...వాది
మరియు
మువ్వల సుబ్రమణ్యం ...ప్రతివాది
To,
మువ్వల సుబ్రమణ్యం S/o లేటు ఆంజనేయులు
డోర్ నెం. 12-31, పర్చూరు.
పర్చూరు మండలం, బాపట్ల జిల్లా.

పై నంబరు గల దావాను మీ పై దాఖలు చేసి మీకు ఎన్నిమార్లు దావా సమన్లు పంపిననూ చేరనందున ఈ ప్రకటన ద్వారా మీకు తెలియజేయునది ఏమనగా ది. 28-12-2022న ఉ. 10-30 ని. లకు వాయిదా ఉన్నందున మీరు స్వయముగా గానీ వకీలు గారిద్వారా గాని పై కోర్టు వారి ఎదుట హాజరయి మీ ఆక్షేపణలు తెలుపుకొన వలసినది. లేనిఎడల మీ పరోక్షమునందు దావాను విచారించి తీర్మానించబడును.

(కోర్టు వారి అనుమతితో)
వాయిదా తేది :- 28-12-2022.

రావి సత్యనారాయణ
రావి శ్రీనివాసరావు
CH. శ్రీ రమణి
న్యాయవాదులు, పర్చూరు.

నూతన ఆర్థిక విధానాలకు వ్యతిరేకంగా పోరాటాలు

సిపిఎం జిల్లా కార్యదర్శి సయ్యద్ హనీఫ్

ప్రజాశక్తి- దొనకొండ

నూతన ఆర్థిక విధానాలకు, ప్రవేటీకరణకు వ్యతిరేకంగా దేశ అభివృద్ధి కోసం సిపిఎం పోరాడుతుందని సిపిఎం జిల్లా కార్యదర్శి సయ్యద్ హనీఫ్ తెలిపారు. సిపిఎం మండల కార్యదర్శి చిరుపల్లి అంజయ్య అధ్యక్షతన దర్శి నియోజకవర్గ స్థాయి సిపిఎం కార్యకర్తలకు రెండో రోజు ఆదివారం శిక్షణా తరగతులు నిర్వహించారు. ఈ సందర్భంగా హనీఫ్ మాట్లాడుతూ సిపిఎం కార్యకర్తలు ప్రజలతో మమేకమై వారి పోరాటాలలోకి తీసుకురావాలన్నారు. మాండూస్ తుపాన్ కారణంగా నష్ట పోయిన రైతులను, కార్మికులను ఆదుకోవాలన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అనుసరిస్తున్న విధానాల వల్ల యువతకు ఉద్యోగాలు రావటం లేదని తెలిపారు. ప్రభుత్వ రంగంలోని భారీ పరిశ్రమలను కార్పొరేట్ కంపెనీలైన అదానీ, అంబానీలకు కారు చౌకగా అమ్మడం వల్ల కార్మికులకు ఉపాధి కోల్పోయి బజారున పడుతున్నారని విమర్శిస్తున్నారు. దేశ వ్యాప్తంగా రైతులు ఏడాది పాటు మూ వ్యవసాయ చట్టాలకు వ్యతిరేకంగా ఢిల్లీలో పోరాటం చేసినట్లు తెలిపారు. దీంతో ప్రధాని మోడీ దిగి వచ్చి చట్టాలను వెనుకకు తీసుకున్నారని, తెలిపారు. ఇది రైతులకు గొప్ప విజయమన్నారు. ఈ పోరాటం అన్ని వర్గాల వారికి ఆదర్శం కావాలన్నారు. పంటలకు గిట్టుబాటు ధరల రక్షణ, కార్మికుల ఉపాధి, కనీస వేతనాలు, విద్య, వైద్యం, మౌలిక సదుపాయాలు, సాగునీటి ప్రాజెక్టులు, బ్యాంకు రుణాలు, టెక్నాలజీ తదితర అభివృద్ధి ప్రజలందరికీ కల్పించకుండా కార్పొరేట్ శక్తులకు మాత్రమే దేశ సంపదను దోచి పెడుతున్నారని తెలిపారు. ఈ ప్రజా వ్యతిరేక విధానాలపై సిపిఎం నాయకులు, కార్యకర్తలు ప్రజలతో మమేకమై ఉద్యమాల్లోకి తీసుకురావాలని పిలుపునిచ్చారు. రెండో రోజు శిక్షణా తరగుతుల్లో భాగంగా నేటి రాజకీయాలు, ప్రజా సమస్యలు, సిపిఎం విధానంపై జిల్లా నాయకుడు దగ్గుబాటి సోమయ్య, పార్టీ లక్ష్యం, నిర్మాణ అంశాలను దర్శి నియోజకవర్గ కార్యదర్శి తాండవ రంగారావు బోధించారు. ఈ కార్యక్రమంలో సిపిఎం మండల కార్యదర్శి చిరుపల్లి అంజయ్య, నాయకులు కర్నా హనుమయ్య, కుందుర్తి అనిల్, అంజిబాబు, శ్రీకాంత్, వెంకట కృష్ణారావు, జాన్ సామ్యూల్, ఉప్పుటూరి నాగరాజు, నారాయణ, కిరణ్‌కుమార్, సందు వెంకటేశ్వరరావు, చిన్నా తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న సయ్యద్ హనీఫ్

చోరీ కేసుల్లో ముగ్గురు అరెస్టు

- రూ.2.30 లక్షల సొత్తు స్వాధీనం

పొదిలి : వివిధ ప్రాంతాల్లో చోరీలకు పాల్పడుతున్న ముగ్గురు నిందితులను అరెస్టు చేసి వారి వద్ద నుంచి రూ.2.30లక్షల విలువైన ఆభరణాలు, రాగి తీగ, ఐదు బైకులను స్వాధీనం చేసుకున్నట్లు ఎస్ఐ కె.మల్లికార్జునరావు తెలిపారు. ఆదివారం ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఎస్ఐ వివరాలు వెల్లడించారు. ఎస్ఐ కథనం ప్రకారం... ఇటీవల పొదిలి ,మార్కాపురం అడ్డరోడ్డులో సిమెంట్ బ్రిక్స్ తయారీ కేంద్రాలలో విద్యుత్ మోటార్ల రాగి తీగల చోరీకి గురైంది. అదేవిధం కొనకనమిట్ల మండల పరిధిలోని చోరీలు జరిగాయి. ఈ నేపథ్యంలో మాచర్ల గ్రామానికి చెందిన శీలం తిరుపతయ్య, సమరం నీలయ్య, కమరగిరి నీలయ్య శనివారం రాత్రి దర్శి రోడ్డులోని ఎస్‌వికెపి డిగ్రీ కళాశాల సమీపంలో అనుమానాస్పదంగా తిరుగుండగా పోలీసులు అదుపులోకి తీసుకొని విచారించారు. పొదిలి, కొనకనమిట్ల, అద్దంకి, గుంటూరు జిల్లాలోని పొలదుగు, సత్తెనపల్లి వివిధ గ్రామాలలో నిందితులు అంగీకరించారు. వారి వద్ద నుంచి 4 గ్రాముల బంగారు చెవి కమ్మలు,జత వెండి కాళ్ళ పట్టీలు, ఐదు బైకులు,రాగి తీగ కలిపి మొత్తం రూ.2,30,000 విలువైన సొత్తును స్వాధీనం చేసుకున్నారు.

నేడు వైపాలెంకు ముగ్గురు మంత్రులు రాక

యర్రగొండపాలెం : యర్రగొండపాలెంలో రాష్ట్ర పురపాలక, పట్టణాభివృద్ధి శాఖ మంత్రి డాక్టర్ ఆదిమూలపు సురేష్ ఆధ్వర్యంలో మహాత్మ జ్యోతిరావు పూలే విగ్రహాన్ని సోమవారం ఏర్పాటు చేయనున్నారు. నియోజక వర్గ పాస్టర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు సన్నెపోగు విజయకుమార్ ఆధ్వర్యంలో సెమీ క్రిస్టస్ 2022 వేడుకలు నిర్వహించనున్నారు. ఈ రెండు కార్యక్రమాలకు ముఖ్య అతిథులుగా రాష్ట్ర పురపాలక, పట్టణాభివృద్ధి శాఖ మంత్రి డాక్టర్ ఆదిమూలపు సురేష్, రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి డాక్టర్ మేరుగ నాగార్జున, రాష్ట్ర గృహ నిర్మాణ శాఖ మంత్రి జోగి రమేష్, మాజీ మంత్రి పి. అనిల్ కుమార్ యాదవ్ హాజరు కానున్నారు

ప్రశ్నించేతత్వాన్ని కలిగి ఉండాలి : డిఇఒ

ప్రజాశక్తి- చీరాల

విద్యార్థులు చిన్న వయస్సు నుంచే ప్రశ్నించే తత్వాన్ని కలిగి ఉండి శాస్త్రీయ ఆలోచనలను పెంపొందించు కోవాలని ఇన్‌ఛార్జి డిఇఒ వెంకటేశ్వర్లు తెలిపారు. జన విజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో స్థానిక గౌతమి జూనియర్ కళాశాలలో జిల్లా స్థాయి జెవివి సైన్స్ సంబరాలు ఆదివారం విజయంతంగా నిర్వహించారు. తౌలుత తహశీల్దారు ప్రభాకర్ రావు, డాక్టర్ గుంటుపల్లి సుబ్బారావు, కళాశాల కరస్పాండెంట్ వెంకటేశ్వర్లు ప్రశ్న పత్రాలను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వక్తలు మాట్లాడుతూ సమాజం శాస్త్రీయంగా బాగా అభివృద్ధి చెందిందినప్పటికీ నేటికీ మూఢనమ్మకాలు వీడలేదని తెలిపారు. జిల్లాస్థాయి చెకుముకి సంబరాలలో గెలుపొందిన విద్యార్థులు జనవరి 21, 22 తేదీలలో నిర్వహిస్తున్న రాష్ట్రస్థాయి చెకుముకి సంబరాలలో పాల్గొంటార తెలిపారు. కార్యక్రమంలో జెవివి రాష్ట్ర ఉపాధ్యక్షుడు కుర్రా రామారావు, జెవివి నాయకులు డి. ప్రసాదు, బండి బిక్షాలబాబు, వీరాంజ నేయులు, కుర్రా శ్రీను, లూక, పిచ్చియ్య ,భాస్కర్ రావు, కళాధర్, రాజేష్ ,హేమంత్, మాల్యాద్రి, రాంబాబు పాల్గొన్నారు.



ప్రశ్నాపత్రాలు ఆవిష్కరిస్తున్న డిఇఒ, జెవివి నాయకులు

వాసవీ క్లబ్ వైస్ ప్రెసిడెంట్‌గా సురేష్

ప్రజాశక్తి -నాగులుప్పలపాడు

వాసవీ క్లబ్ ఇంటర్నేషనల్ - 2023 వైస్ ప్రెసిడెంట్‌గా ఉప్పుగుండూరు గ్రామానికి చెందిన కొంజేటి వెంకట సురేష్ బాబు నియమితు లయ్యారు. హైదరాబాదులోని క్లాసిక్ కన్వెన్షన్ సెంటర్లో వాసవీ క్లబ్ ఇంటర్నే షనల్ కాన్ఫరెన్స్ ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా వాసవీ క్లబ్ ఇంటర్నే షనల్ అంతర్జాతీయ అధ్యక్షురాలు పాలకుర్తి గాయత్రిదేవి సురేష్ బాబును అంతర్జాతీయ ఉపాధ్యక్షుడిగా నియమించి ప్రమాణ స్వీకారం చేయించారు. ఈసందర్భంగా సురేష్ మాట్లాడుతూ వాసవీ క్లబ్ అభివృద్ధికి తనవంతు కృషిచేస్తానన్నారు. క్లబ్ ద్వారా మరిన్ని సేవా కార్యక్రమాలు నిర్వహిస్తామని తెలిపారు. ఈ సందర్భంగా సురేష్‌కు వాసవీక్లబ్ సభ్యులు అమరా వేణు, పులకంం రాజేష్, ప్రసాద్ దేసు సుధాకర్ అభినందనలు తెలిపారు.



ప్రమాణ స్వీకారం చేస్తున్న సురేష్

నష్టపరిహారం ఇవ్వాలి

పొదిలి : పొదిలిలో విశ్వబ్రాహ్మణ ఆరామ క్షేత్రాన్ని కూల్చి వేసిన ఘటనలో ప్రభుత్వం పరిహారం చెల్లించాలని, హడావిడిగా కూల్చివేసిన అధికారులను సస్పెండ్ చేయాలని విశ్వబ్రాహ్మణ సంఘం జిల్లా అధ్యక్షుడు చెన్నుపల్లి శ్రీనివాసాచారి డిమాండ్ చేశారు. కూల్చివేసిన ఆరామక్షేత్రం భవన ప్రాంతాన్ని జిల్లా కమిటీ సభ్యులతో కలిసి శ్రీనిసాచారి ఆదివారం పరిశీలించారు. ఈ సందర్భంగా భవన కూల్చి వేత గురించి స్థానిక నాయకులు సావంతపూడి నాగేశ్వరరావు, యద్దనపూడి వీర బ్రహ్మచారిలతో చర్చించారు. ఈ కార్యక్రమంలో సంఘం రాష్ట్ర కార్యదర్శి పొన్నపల్లి బ్రహ్మానందం, గౌరవాధ్యక్షుడు జి. బ్రహ్మేంద్ర కుమార్ పాల్గొన్నారు



విజయం సాధించిన అబ్దుల్ గఫార్ ప్యానెల్

కాస్మోపాలిటన్ క్లబ్ ఎన్నికల్లో అబ్దుల్ గఫార్ ప్యానెల్ విజయం

ప్రజాశక్తి-కనిగిరి

కనిగిరి కాస్మోపాలిటన్ క్లబ్ నూతన కమిటీకి ఆదివారం ఎన్నికలు జరిగాయి. ఈ ఎన్నికలలో ప్రముఖ న్యాయవాది, మున్సిపల్ చైర్మన్ షేక్ అబ్దుల్ గఫార్ ప్యానెల్ ఘన విజయం సాధించింది. అధ్యక్ష పదవిని ఒక్క ఓటు ఆధిక్యంతో అబ్దుల్ గఫార్ విజయం సాధించారు. ఉపాధ్యక్షుడిగా ముత్యాల శ్రీనివాసరెడ్డి, ప్రధాన కార్యదర్శిగా సిరువ వెంకట గోవర్ధన్‌రెడ్డి, సహకార్యదర్శిగా పులి రమేష్‌రెడ్డి, కోశాధికారిగా గంగిశెట్టి అల్లూరి సత్యనారాయణ, కార్యవర్గ సభ్యులుగా మాకినేని నరసింహారావు,అంబాల చిన సుబ్బారెడ్డి,చిలకల శ్రీనివాసరెడ్డి, మునగా వెంకట ప్రసాద్ విజయం సాధించారు. నూతన కమిటీకి కనిగిరి ఎఎంసి మాజీ చైర్మన్ దారపునేని చంద్రశేఖర్, మున్సిపల్ వైస్ చైర్మన్ పులిశాంతి తదితరులు అభినందనలు తెలిపారు.

గిరిజన విద్యార్థికి పిహెచ్‌డి పట్టా

పెద్దదోర్నాల : పశ్చిమ ప్రకాశంలోని మారుమూల ప్రాంతమైన గంటవానిపల్లె గ్రామానికి చెందిన దేశవత్ చంద్రశేఖర్ నాయక్‌కు కృష్ణ విశ్వ విద్యాలయం పిహెచ్‌డి పట్టాను అందజేసింది. చంద్రశేఖర్ నాయక్ కెవిఎస్ఆర్ సిద్దార్థ కాలేజ్ ఆఫ్ ఫార్మసీ సైన్సెస్‌లో డాక్టర్ ఎ. భారతి ఆధ్వర్యంలో నూతన ఔషధ తయారీ, అడవి మొక్కలతో కొత్త పద్ధతిని అనువదించారు. ఈ సందర్భంగా చంద్రశేఖర్ నాయక్ తనకు రీసెర్చ్ వర్క్‌కు సాయమందించిన అధ్యాపకురాలికి, తమ తల్లిదండ్రులకు కతజ్ఞతలు తెలిపారు. పిహెచ్‌డి పట్టా అందుకున్న చంద్రశేఖర్ నాయక్‌కు బంధుమిత్రులు, గ్రామస్తులు అభినందనలు తెలిపారు.



చంద్రశేఖర్ నాయక్

ఉబ్బిన రక్తనాళాలకు లేజర్ చికిత్స

చీరాల : స్థానిక శ్రీకామాక్షి కేర్ హాస్పిటల్‌లో వేరికోస్ వెయిన్స్(ఉబ్బిన రక్తనాళాలు) సమస్యకు ఇన్సూరెన్స్ మరియు ఆరోగ్యశ్రీ ద్వారా వైద్యసేవలు అందించారు. హైదరాబాద్‌లోని ఏపిఎస్ హాస్పిటల్ మరియు శ్రీ కామాక్షి కేర్ హాస్పిటల్ సంయుక్త ఆధ్వర్యంలో వేరికోస్ వేయిన్స్ స్పెషలిస్ట్ డాక్టర్ పవన్ కుమార్ ఆధ్వర్యంలో రక్తనాళాలు ఉబ్బినవారికి అరి కాళ్లలో పుండ్లు ఉన్నవారికి ఆదివారం ప్రత్యేక వైద్య శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా శ్రీకామాక్షి కేర్ హాస్పిటల్ ఎమ్‌డి డాక్టర్ తాడివలస దేవరాజు మాట్లాడుతూ హైదరాబాద్ విజయవాడ, గుంటూరు లాంటి నగరాలకు వెళ్లాల్సిన అవసరం లేకుండా అత్యాధునికమైన వైద్య సేవలను ఇక్కడే అందిస్తున్నట్లు తెలిపారు. అందుకోసం శ్రీకామాక్షి కేర్ హాస్పిటల్ యాజమాన్యం, వైద్య బృందం నిత్యం పని చేస్తుందని తెలిపారు. లేజర్ ద్వారా రక్తనాళాలు ఉబ్బిన వారికి చీరాలలోనే ఆపరేషన్ సౌకర్యం కల్పించినట్లు తెలిపారు. రక్తనాళాలు ఉబ్బిన వారికి జనరల్ ఆపరేషన్ ద్వారా డాక్టర్ వైఎస్ఆర్ ఆరోగ్యశ్రీ ద్వారా ఉచితంగా ఆపరేషన్లు నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎపిఎస్ హాస్పిటల్ జిఎం సుదీప్త చౌదరి, బి.శ్రీనివాసరావు, వినోద్ కుమార్, శ్రీకామాక్షి కేర్ హాస్పిటల్ జిఎం తాడివలస సురేష్ , హెస్పా సంస్థ మేనేజర్ రజని కుమార్, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.



డాక్టర్ పవన్ ను సన్మానిస్తున్న డాక్టర్ తాడేవలస దేవరాజు



వధూవరులను ఆశీర్వదిస్తున్న ఎమ్మెల్యే గొట్టిపాటి రవికుమార్

వివాహవేడుకల్లో ఎమ్మెల్యే గొట్టిపాటి

ప్రజాశక్తి- అద్దంకి

మండల పరిధిలోని నాగులపాడు గ్రామానికి చెందిన మాజీ ఎంపిపి కరి పరమేష్ సోదరుడు కరి శ్రీనివాసరావు, ఉషా పద్మలత దంపతుల కుమార్తె వివాహ వేడుకలు ఆదివారం నిర్వహించారు. ఈ వేడుకలకు అద్దంకి ఎమ్మెల్యే గొట్టిపాటి రవికుమార్ హాజరై నూతన వధూవరులు హిమబిందు,వెంకట వంశీకృష్ణను ఆశీర్వదించి శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు పాల్గొన్నారు.

వాన ముసురు.. పంటలకు ఎసరు..

జిల్లాలో 42 మి.మీల వర్షపాతం

చెరుకుపల్లిలో అత్యధికంగా 75.4 మి.మీ

ప్రజాశక్తి - బాపట్ల జిల్లా

తుపాను కారణంగా జిల్లాలోని 25 మండలాల్లో వర్షపాతం నమోదయింది. చెరుకుపల్లిలో అత్యధికంగా 75.4 మిల్లిమీటర్ల వర్షం పాతం నమోదైంది. వేటపాలెం మండలంలో అత్యల్పంగా 15.4 మిల్లిమీటర్ల వర్షపాతం నమోదైంది. చుండూరులో 32.8 మి.మీ, అమృతలూరులో 48-0, వేమూరులో 53.2, కొల్లూరులో 37, భట్టిప్రోలులో 72.6, పిట్లవానిపాలెంలో 67.6,కర్లపాలెంలో 75.2మి.మీ, బాపట్లలో 22.8, నిజాంపట్నంలో 52.4,నగరం 63.6,రేపల్లెలో 46, సంతమాగులూరులో 37.2, బల్లికురవలో 32.6, యద్దనపూడిలో 37, పర్చూరులో 55.4, జె.పంగులూరులో 32.4, అద్దంకిలో 47.2, కోరిశపాడులో 45.8 మి.మీ వర్షపాతం నమోదైంది.

- వందలాది ఎకరాల్లో నీట మునిగిన పంటలు
- తడిసి ముద్దయిన వరి ఓదెలు
- ఉరకెత్తిన పొగాకు, మొక్కజొన్న
- దెబ్బతిన్న పంటల పరిశీలన



పర్చూరు మండలం వీరన్న పాలెంలో నీట మునిగిన పొగాకు పంట

ప్రజాశక్తిభట్టిప్రోలు

తుపాన్ కారణంగా కురిసిన వర్షానికి మండల పరిధిలోని అద్దేపల్లి గ్రామంలో దెబ్బతిన్న పంటలను సాంఘిక సంక్షేమ శాఖామంత్రి డాక్టర్ మేరుగ నాగార్జున ఆదివారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన పంట నష్టాన్ని గురించి వ్యవసాయ శాఖ అధికారులను అడిగి వివరాలు తెలుసుకున్నారు. అనంతరం మంత్రి మాట్లాడుతూ పంటల నష్టాన్ని ముఖ్యమంత్రి దష్టికి తీసుకువెళ్లి రైతులకు న్యాయం చేసేందుకు కృషి చేస్తామని తెలిపారు. రంగుమారిన ధాన్యాన్ని రైతు భరోసా కేంద్రాల కొనుగోలు చేయనున్నట్లు ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా వ్యవసాయ అధికారి సయ్యద్ అబ్దుల్ సతార్,ఆర్‌డిఒ పార్థసారధి, ఎంపిపి లలితకుమారి,జడ్‌పిటిసి ఉదయ్ భాస్కరి, సర్పంచి రవికిరణ్మయి, తహాశీల్దారు శ్రావణ్ కుమార్ తదితరులు ఉన్నారు. **వేమూరు :** తుపాన్ ప్రభావంతో నియోజకవర్గ పరిధిలోని వేమూరు, అమృతలూరు, కొల్లూరు, చుండూరు, భట్టిప్రోలు మండలాలలో శనిఎ, ఆదివారాల్లో భారీ వర్షం కురిసింది. దీతో లోతట్టు ప్రాంతాల్లో నీరు చేరింది. వరి ఓదెలు నీటిలో తేలాడుతున్నాయి.ఆరు గాలం కష్టపడి పండించిన పంటలు తీరా చేతికొచ్చే దశలో వర్షం కారణంగా నీట మునగడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. పొలాల్లో నీటిని బయటకు పంపేందుకదు రైతులు కృషి చేస్తున్నారు. వ్యవసాయాధికారులు వేమూరు,కొల్లూరు మండలాల్లో నీట మునిగిన పంటలను పరిశీలించారు. **నగరం :** తుపాన్ ప్రభావంతో కురిసిన వర్షాలకు నీట మునిగిన పంటలను తహాశీల్దారు శ్రీనివాసరావు పరిశీలించారు. రైతులకు పలు సూచనలు చేశారు. సజ్జవారిపాలెంలో తడిచిన పంటలను ఆయన పరిశీలించారు. ఎఒ రమేష్ బాబు మండల పరిధిలోని తోటపల్లి, కొలగనివారిపాలెం ,సజ్జవారిపాలెం, అల్లపర్రు గ్రామాల్లో నీట మునిగిన వరి పంటను పరిశీలించి రైతులకు సూచనలు , సలహాలు చేశారు. ఈ కార్యక్రమంలో ఎఇఒ కె. నాగ శ్రీనివాసరావు, గ్రామ వ్యవసాయ అధికారులు బి గంగా భవాని, యం. పూజరసజ్ఞ, జి. వసంత, రెవెన్యూ సిబ్బంది జబిరుల్లా , విచిట్టిబాబు పాల్గొన్నారు. **చెరుకుపల్లి :** తుపాన్ కారణంగా మండలంలో శనివారం రాత్రి భారీ వర్షం పడింది. సుమారు 80 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైంది. వరి చేలలో నీరు నిలబడింఇ. ఈ పాటికే కోతలు కోసిన చేలలో ఓదేలు తడిసి ముద్ద అయ్యాయి. సుమారు ఐదువేల ఎకరాల్లో వరి పంటకు నష్టం వాటినట్లుగా ప్రాథమిక అంచనా వేశారు. ఆదివారం మేఘావతం అయినప్పటికీ సాయంత్రం వరకు వర్షం లేకపోవడంతో రైతులు ఊపిరి పీల్చుకున్నారు. చేలలో నిలబడిన నీరును బయటకు పంపేందుకు రైతులు చర్యలు చేపట్టారు. **భట్టిప్రోలు :** తుపాన్ కారణంగా కురిసిన వర్షానికి మాగాణి పొలాల రైతులు విలవిలాడుతున్నారు. ఖరీఫ్ సీజన్‌లో సుమారు 15 వేల ఎకరాలలో వరిపంట సాగు చేశారు. ఈ పాటికే 50 శాతానికి పైగా వరి కోతలు పూర్తయ్యాయి. యంత్రాల ద్వారా ధాన్యం కోయించుకున్న రైతులు అనంతరం మొక్కజొన్న పంటను సాగుచేశారు.ప్రస్తుతం మొలక దశలో ఉండగా వర్షానికి పూర్తిగా నీటము నిగింది. ఈ పాటికే ఎకరాకు రూ.5 వేలు కు పైగా ఖర్చు చేసినట్లు తెలిపారు. వేలాది ఎకరాలలో వరి ఓదేలు నీటి మునిగాయి. ఆర్‌డిఒ పార్థసారధి మండల పరిధిలోని అద్దేపల్లి గ్రామంలో దెబ్బతిన్న పంటలను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో తహాశీల్దారు శ్రావణ్ కుమార్,ఆర్‌ఐ శివరామకష్ణ,విఆర్‌ఒ రత్నాకర్, గ్రాసమ్మ, విఒఎలు తదితరులు పాల్గొన్నారు.

దెబ్బతిన్న పంటలను నమోదు చేయాలి

వర్షాలకు దెబ్బతిన్న పంటలను నమోదు చేసి రైతులకు నష్టపరిహారం చెల్లించాలని కోరుతూ ఎపి రైతు సంఘం ఆధ్వర్యంలో ఆర్‌డిఒ పార్థసారధికి వినతిపత్రం అందజేశారు. పంట బీమా అందించి మొక్కజొన్న విత్తనాలను ఉచితంగా అందజేయాలన్నారు. మెట్టప్రాంతంలో సాగుచేసే దెబ్బతిన్న మినుము పంటను కూడా పరిశీలించి నమోదు చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో రైతు సంఘం నాయకులు వేములపల్లి వెంకట్రామయ్య, కె.రామస్వామి, జి.సుధాకర్, ఎం. సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు. **కొల్లూరు :** తుపాన్ కారణంగా కొల్లూరు గ్రామంలో దెబ్బతిన్న వరి, ఇతర పంట ఆర్‌డిఒ పార్థసారధి పరిశీలించారు.ఈ సందర్భంగా ఆర్‌డిఒ మాట్లాడుతూ తడిసిన పంటలను రైతులు దళారులకు తక్కువ ధరలకు అమ్ముకుని మోసపోవద్దని తెలిపారు. రైతు భరోసా కేంద్రాల ద్వారా ప్రభుత్వం కొనుగోలు చేస్తుందని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎఒ వెంకటేశ్వర్లు, తహాశీల్దారు శ్రీనివాసరావు, అర్‌ఐ శివ నాగ త్రివేణి, రైతు భరోసా కేంద్రం సిబ్బంది పాల్గొన్నారు. **చెరుకుపల్లి :** తుపాన్ కారణంగా మండల పరిధిలోని పొన్నపల్లి ,నడింపల్లి, గూడవల్లి, కనగాల, ఆరేపల్లి తూర్పు పాలెం ,గుల్లపల్లి, ఆరుంబాక, చెరుకుపల్లి గ్రామాల్లో వరి ఓదెలు నీటి మునిగాయి. దీంతో రైతులు ఓదెలను కట్టలు కట్టి నిలబెడుతున్నారు. ప్రభుత్వం దెబ్బతిన్న పంటలకు నష్టపరిహారం చెల్లించాలని రైతులు కోరారు. **రేపల్లె :** తుపాను కారణంగా రెండు రోజులుగా కురిసిన వర్షాలకు దెబ్బతిన్న పంట పొలాలను ఆర్‌డిఒ జగన్నాథం పార్థసారథి, తహాశీల్దారు వీర వసంతరావు వేర్వేరు గ్రామాల్లో ఆదివారం పరిశీలించారు. పొలాల్లో వరద నీరు తగ్గితే అధికారులు పంటనష్టం అంచనా వేస్తారని తెలిపారు. నీటి మునిగిన వరి పొలాలను పరిశీలించి, రైతులకు తగిన సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో రెవెన్యూ సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.



బట్టిప్రోలులో దెబ్బతిన్న వరి పంటను పరిశీలిస్తున్న మంత్రి మేరుగ నాగార్జున



బట్టిప్రోలులో నీట మునిగిన వరి కుప్ప



నగరంలో తడిసిన పంటలను పరిశీలిస్తున్న అధికారులు



దెబ్బతిన్న పంట పొలాలను పరిశీలించిన ఆర్‌డిఒ



చెరుకుపల్లిలో తడిసిన ఓదెలను కట్టలు కట్టి నిలబెడుతున్న కూలీలు



కొల్లూరులో పొలంలోని నీటిని బయటకు పంపిస్తున్న రైతులు



చెరుకు పల్లిలో నీట మునిగిన పంటలు

ముంచిన మాండూస్ తుపాను

పొంగిన వాగులు • నీటమునిగిన పంటలు
కోట్లాది రూపాయలు నష్టం

ప్రజాశక్తి-నాగులుప్పలపాడు

మాండూస్ తుపాన్ ప్రభావంతో గత రెండు రోజుల నుంచి కురుస్తున్న వర్షాలతో రైతాంగాన్ని నిలువునా ముంచింది. పంటలన్నీ నీటమునగడంతో రైతులు కన్నీటి పర్యంతమవుతున్నారు. ఎటు చూసినా పంట పొలాలన్నీ నీటితో నిండి చెరువులను తలపిస్తున్నాయి. మండలంలో ఖరీఫ్, రబీల్లో మిర్చి, పొగాకు, శనగ, కొత్తిమీర, కుసుమ, మినుము తదితర పంటలు సాగుచేశారు. ప్రస్తుత వాతావరణ పరిస్థితుల్లో పంటలన్నీ శనివారం సాయంత్రం వరకు పడిన వర్షాలకు సస్యశ్యామలంగా ఉండడంతో మంచి ఫలితాలు వస్తాయని రైతులు ఆశించారు. కాని శనివారం రాత్రి నుంచి పడిన వర్షాలకు పంటలన్నీ నీటమునిగి పోవడంతో ఏ పంటా చేతికి వచ్చే పరిస్థితి లేదని రైతులు భోరున విలపిస్తున్నారు. లక్షలాది రూపాయలు పెట్టుబడులు పెట్టారు. మండలంలో 3 వేల హెక్టార్లలో సాగు చేశారు. ఎకరానికి రూ.70 వేల దాకా ఖర్చు చేశారు. ఈ వర్షాలకు పంట ఉరకెత్తే ప్రమాదం ఉందని అంటున్నారు. శనగ 5వేల హెక్టార్లలో సాగు చేశారు. పెట్టుబడి రూపంలో ఎకరానికి రూ.15 వేల దాకా ఖర్చు చేశారు. పూర్తిగా దెబ్బతినే ప్రమాదం ఉండడంతో తిరిగి మరలా వెద పెట్టవలసిన పరిస్థితి నెలకొంది. పొగాకు 5 వేల హెక్టార్లలో సాగు చేశారు. ఎకరానికి ఈపాటికే 50 వేల దాకా ఖర్చు చేశారు. మినుము 500 హెక్టార్లలో, కుసుమ 50 హెక్టార్లలో సాగు చేశారు. ఏదిఏమైనా ఏ పంటలూ పనికి వచ్చే పరిస్థితి లేదని రైతాంగం ఆందోళన చెందుతున్నారు. వెంటనే పంటల నష్టాన్ని అంచనావేసి నష్టపరిహారంతో పాటు తిరిగి వ్యవసాయం చేయడానికి ప్రభుత్వమే ఉచితంగా విత్తనాలు అందచేసి రైతాంగాన్ని ఆదుకోవాలని రైతులు కోరుతున్నారు. ఇదిలా ఉండగా వర్షాలకు మండలంలోని వివిధ గ్రామాల్లో వాగులు పొంగి ప్రవహించాయి. కొత్తకోట హనుమాపురం వాగులు పొంగి ప్రవహించడంతో ఆయా గ్రామాల ప్రజలు పలు ఇబ్బందులు ఎదుర్కొన్నారు. అదేవిధంగా ఉప్పుగుండూరు నాగన్నవాగు, మట్టిగుంటవాగు పొంగి ప్రవహించడంతో రాకపోకలకు అంతరాయం ఏర్పడింది.

మద్దిపాడు: గత రెండు రోజులుగా కురుస్తున్న వర్షాలకు పంటలు దెబ్బ తిన్నాయి. రాచవారిపాలెం గ్రామానికి చెందిన రావి చిరంజీవికి చెందిన రెండెకరాల పొగాకు పంట పూర్తిగా నీట మునిగిపోయింది. కొట్టుడుకు వచ్చిన తోట నీట మునగడం తో ఆందోళన చెందుతున్నాడు. మండలంలోని శనగ, పొగాకు, మిరప, మినుము పంటలు నీటమునిగినట్లు మండల వ్యవసాయ అధికారి కే రమేష్ బాబు తెలిపారు. ముందుగా పొలంలోని నీటిని బయటకు తీయాలని తెలిపారు. అనంతరం యూరియా 50 కెజిలు, ఎంఒపి 20 కేజీలు వేపపిండి వేయాలన్నారు. నీరు ఎక్కువ ఉన్నచో పొటాషియం నైట్రేట్ 10 గ్రాములలో 100 లీటర్లలో కలిపి రెండు రోజుల వ్యవధిలో చల్లాలని పేర్కొన్నారు. మండల పరిధిలో శనగ -2000, పొగాకు -1500, మినుము-100 ఎకరాల్లో వేసినట్లు వ్యవసాయాధికారి తెలిపారు. త్వరగా అంచనాలు తయారు చేసి ఉన్నత అధికారులకు పంపనున్నట్లు తెలిపారు.

యర్రగొండపాలెం: యర్రగొండపాలెం మండలంలో తుఫాన్ ప్రభావంతో కురుస్తున్న వర్షాలు రైతులలో కొందరికి మోదం మిగల్చగా, మరికొందరికి ఖేదం కలిగిస్తున్నాయి. వాణిజ్య పంటలైన బత్తాయి, బొప్పాయి, నిమ్మ, అరటి తోటలకు ఈ వర్షం ఎంతో ఉపకరిస్తుండగా మిర్చి, కంది రైతులకు కంటనీరు పెట్టిస్తోంది. ఖరీఫ్‌లో సాగు చేసిన మిర్చి, కంది పంటలు ప్రస్తుతం పూత, పిందె దశలో ఉన్నాయి. అయితే రెండు రోజులు పాటు మండల వాప్తంగా 51.6 మీమీ వర్షం కురవడంతో కంది, మిర్చి తోటల్లోని పూత, పిందె నేలరాలాయి. అక్కడక్కడా కోతకు సిద్ధంగా ఉన్న పత్తి మొత్తం నీళ్లపాలైంది. అలాగే దానిమ్మ తోటలకు ఈ వర్షం తీవ్ర నష్టాన్ని కలిగించిందని రైతులు వాపోతున్నారు.

పెద్దదోర్నాల: దోర్నాల మండలంలో గత రెండు రోజులుగా 69 మీమీ వర్షపాతం కురిసింది. దీంతో ముఖ్యంగా చిన్న దోర్నాల గ్రామంలోని మిరప తోటలన్నీ నీట మునిగాయి. ఈ పాటికే తొలి కాపుకు సిద్ధమైన మిరప తోటల్లో నీరు నిలువ ఉండడంతో మరో రెండు రోజులు పాటు ఇదే విధంగా వర్షాలు కురిస్తే ఉరకలెత్తి తీవ్ర నష్టం వాటిల్లే అవకాశం ఉందని రైతులు వాపోతున్నారు. తొలికాపు కోతకు సిద్ధమైన కాయలన్నీ బూజుపట్టి తెల్లకాయలుగా మారతాయని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

త్రిపురాంతకం: త్రిపురాంతకం మండలంలో ఈ ఏడాది 8700 ఎకరాల్లో వరి, కందిను సాగు చేశారు. వరి పంట పండి కోతకు సిద్ధమైంది. రెండు మూడు రోజుల్లో కోసి ఓదెలేద్దామనుకున్న తరుణంలో తుఫాను ప్రభావంతో రెండు రోజుల నుంచి వర్షం ఎడతెడపి లేకుండా కురుస్తుండడంతో వరి పంటంతా ఒరిగి నేలమట్టమైంది. మండలంలో 57.8 మి.మీ వర్షపాతం నమోదైంది. దీంతో పొలాల్లో నీరు నిల్వ ఉంది. ఈ నీటిలోనే వరి పంటంతా వంగిపోయి సడిపోయింది. దీంతో తీవ్ర నష్టం వాటిల్లే అవకాశం ఉందని రైతులు వాపోతున్నారు. మరో రెండు రోజులు ఇదే మాదిరిగా వర్షం కురిస్తే ఒక గింజ కూడా పనికి రాదని వాపోతున్నారు. ఈపాటికే వడ్లన్నీ తడిసిపోయాయని రైతులు వాపోతున్నారు.

జరుగుమల్లి: జరుగుమల్లి మండలంలో మాండోస్ తుఫాను ప్రభావం వలన గత మూడు రోజుల నుంచి ఎడతెరపి లేకుండా కురుస్తున్న వర్షాల ప్రభావం వలన 7805 ఎకరాలలో పంట దెబ్బతిన్నట్లు మండల వ్యవసాయాధికారి డి యుగంధరరెడ్డి తెలిపారు. మండలంలోని ఎడ్లూరపాడు గ్రామంలో ఆయన ఆదివారం పర్యటించారు. మండలంలోని 20 గ్రామాలలో రబీ సీజనులో 14,787 ఎకరాలకు గాను నికరం సాగు చేసిన ప్రధాన పంటలు ఎకరాలలో వరి 390, మినుము 820, శనగ 3800, పొగాకు 2580, మిరప 605, పత్తి 100 ఎకరాలలో రైతులు సాగు చేశారు. మాండోస్ తుఫాను ప్రభావం వలన ప్రాథమిక అంచనా ప్రకారం దెబ్బతిన్న పంటల వివరాలు ఎకరాలలో మినుము 820, శనగ 3,800, పొగాకు 2,580, మిరప 605 ఎకరాలలో దెబ్బతింది. రైతులకు ఇప్పటి వరకు ఒక ఎకరానికి సుమారుగా అయిన ఖర్చు మినుము రూ.25,000, మిరప రూ.90,000, శనగ రూ.10,000, కంది రూ.9,000, పొగాకు రూ.20,000 అయినట్లు పలువురు రైతులు తెలిపారు.

సంతనూతలపాడు రూరల్: మాండూస్ తుఫాను కారణంగా గత రెండు మూడు రోజుల నుంచి కురుస్తున్న భారీ వర్షాల వల్ల సంతనూతలపాడు మండలంలో 4,066 ఎకరాల్లో వివిధ రకాల పంటలు దెబ్బతిన్నాయని మండల వ్యవసాయ అధికారి పావని తెలిపారు. మినుము 887 ఎకరాలు, శనగ 1,715 ఎకరాలు, పొగాకు 950 ఎకరాలు, మిరప 280 ఎకరాలు, పత్తి 35 ఎకరాలు, అలసంద 149 ఎకరాలు, జనపనార 22 ఎకరాలు, కంది 28 ఎకరాల్లో దెబ్బతిన్నాయని ఏఓ తెలిపారు.

రైతులను ఆదుకోవాలి: డాక్టర్ ఉగ్ర

ప్రజాశక్తి-కనిగిరి

కనిగిరి మండలం బల్లిపల్లి, నల్లారెడ్డిపల్లి తదితర గ్రామాల్లో మాండూస్ తుఫాను కారణంగా దెబ్బతిన్న బొబ్బరు, మినుము, శనగ, వరి పంట పొలాలను కనిగిరి మాజీ ఎమ్మెల్యే, నియోజకవర్గ టిడిపి ఇన్‌ఛార్జి డాక్టర్ ముక్కు ఉగ్రనరసింహారెడ్డి ఆదివారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడతూ అసలే అంతంత మాత్రంగా పంటలు పండే ప్రకాశం జిల్లా అందులో వెనుకబడిన కనిగిరి ప్రాంతంలో చేతికందివచ్చిన పంటలు మాండూస్ తుఫాన్ కారణంగా దెబ్బతినటం బాధాకరమని అన్నారు. నష్టాలతో ఆత్మహత్యలకు ఎక్కువగా పాల్పడింది ఆంధ్రా రైతులేనని పార్లమెంటులో చర్చ జరిగిందన్నారు. కనిగిరి ప్రాంతంలో ఈ క్రాప్ కూడా సంబంధిత శాఖ అధికారులు పూర్తి స్థాయిలో చేయకపోవటంతో తుఫాను కారణంగా రైతులకు పరిహారం పొందటం ప్రశ్నార్థకంగా మారిందని పేర్కొన్నారు. ఇప్పటికైనా ఈ క్రాప్ నమోదు ప్రక్రియ పూర్తిచేయటంతోపాటు దెబ్బతిన్న పంటలను పరిశీలించి రైతులకు పంట నష్టపరిహారం పొందేలా ఉన్నతాధికారులకు నివేదికలు పంపించాలని డిమాండ్ చేశారు. రైతులకు పంట నష్టపరిహారం అందకపోతే ఆత్మహత్యలు తప్ప మరో మార్గం ఉండదన్నారు. ఆయన వెంట టిడిపి మండల పార్టీ అధ్యక్షులు నంబుల వెంకటేశ్వర్లు, నాయకులు పిచ్చాల శ్రీనివాసరెడ్డి, కాసు హరి కృష్ణారెడ్డి, నాగిరెడ్డి, మల్లికార్జున తదితరులు పాల్గొన్నారు.



మినుము పంటను పరిశీలిస్తున్న డాక్టర్ ఉగ్ర



టంగుటూరు బాపూజీ కాలనీ సమీపంలో నీట మునిగిన పొగాకు

టంగుటూరు: మండలంలోని పొగాకు రైతులు ఏదైతే జరగకూడదని అనుకున్నారో అదే జరిగింది. గత శనివారం రాత్రి నుంచి వర్షం ఆగితే అదే పదివేలు అనుకున్న పొగాకు రైతుల ఆశలు గల్లంతయ్యాయి. గత శుక్రవారం ఉదయం నుంచి ప్రారంభమైన మాండూస్ తుఫాను ప్రభావిత వర్షం ఆదివారం సాయంత్రం వరకూ కురుస్తూనే ఉంది. టంగుటూరు పొగాకు బోర్డు పరిధిలో ఈ ఏడాది 5,300 హెక్టార్ల పరిధిలో పొగాకు సాగుకు బోర్డు అధికారులు అనుమతి ఇచ్చారు. దీంతో గత ఏడాది ఆశాజనకంగా ఉన్న పొగాకు ధరలతో బోర్డు అధికారులు ఇచ్చిన అనుమతి కంటే కొంచెం అధికంగా రైతులు బ్యారన్, పొలాలను కౌలుకు తీసుకొని పొగాకు సాగు చేపట్టారు. బోర్డు అధికారుల నిబంధనల మేరకు ఒక బ్యారన్‌కు 4.75 ఎకరాలు మాత్రమే సాగు చేపట్టాలి. బోర్డు మొత్తం మీద 13,500 ఎకరాల సాగుకు అధికారులు అనుమతించగా రైతులు 10వేల ఎకరాలలో సాగు చేపట్టినట్లు విశ్లేషణలున్నాయి. ఆదివారం రాత్రికి వర్షం ఆగిందని అనుకున్నప్పటికీ పెట్టిన పెట్టుబడిలో కేవలం 20 శాతం మాత్రమే వెనక్కి వచ్చే అవకాశాలున్నాయని రైతులు ఆందోళన చెందుతున్నారు. బోర్డు పరిధిలో సాగు అయిన 10వేల ఎకరాలలో ఒక్క టంగుటూరు మండలంలోనే 7,500 ఎకరాలు సాగు చేసినట్లు అధికారుల నివేదికలు వెల్లడిస్తున్నాయి. బోర్డు పరిధిలో రూ.42 కోట్ల మేర నష్టం వాటిల్లింది. టంగుటూరు పొగాకు బోర్డు నివేదికల మేరకు ఇప్పటివరకు పొగాకు సాగు 10వేల ఎకరాలుగా ఉంది. దీనిలో వర్షం పూర్తిగా బయటకు పోతే తప్ప నష్టం నివేదికలు పూర్తి స్థాయిలో తేలవని అధికారులు చెబుతున్నారు. పొగాకు పెట్టుబడి విషయంలోనూ అధికారులు, రైతుల మధ్య భిన్న వాదనలున్నాయి. బోర్డు అధికారులు పొగాకు సాగు పెట్టుబడి ఎకరాకు రూ.30,000 మించదని చెబుతుండగా రైతులు మాత్రం ఖచ్చితంగా రూ.60,000 ఖర్చవుతుందని వాదిస్తున్నారు. ప్రస్తుతం నాటిన పొగాకులో 70 శాతం మేర నష్టం వచ్చినట్లు అంచనా వేసినప్పటికీ రూ.42 కోట్ల మేర బోర్డు పరిధిలోని పొగాకు రైతులకు నష్టం వాటిల్లినట్లు విశ్లేషణలున్నాయి. ఇప్పటికైనా వరుణుడు కరుణిస్తే పొగాకు నష్టం కొద్దిమేర తగ్గే అవకాశం ఉందని రైతులు ఆశిస్తున్నారు. అధికారులు, సిబ్బంది ఇప్పటికైనా పొగాకు నష్టం వివరాలను ఖచ్చితంగా బహిర్గత పరిచి ప్రభుత్వం, బోర్డు ద్వారా ఆదుకోవాలని పొగాకు రైతులు విజ్ఞప్తి చేస్తున్నారు.

రూ.1 కోటి దాకా నష్టం..

మొలకలపల్లి కోటేశ్వరరావు, ఉపసర్పంచ్, పొగాకు రైతు

సూరారెడ్డిపాలెం నాతో పాటు మా కుటుంబ సభ్యులు, సమీప బంధువులందరం కలిసి ఈ ఏడాది 130 ఎకరాలలో పొగాకు సాగు చేపట్టాం. గత మూడు రోజులుగా కురుస్తున్న వర్షంతో కొంత ఆందోళనగానే ఉంది. శనివారం నాటికి తగ్గుతుందని భావించినప్పటికీ ఆదివారం రాత్రి దాకా వర్షం ఆగలేదు. పొగాకు సాగు ఎకరాకు రూ.60 వేల నుంచి లక్ష దాకా పెట్టుబడి అయింది. మాండూస్ తుఫాను ప్రభావంతో సాగు చేసిన పొగాకు పంటలన్నీ వర్షం నీటిలో మునిగాయి. నీటిని బయటకు పంపే మార్గం కూడా లేదు. ఎంత తక్కువగా అనుకున్నప్పటికీ రూ.కోటి దాకా నష్టం వస్తుంది.

పొన్నలూరు: మాండూస్ తుఫాన్ ప్రభావంతో మూడు రోజులుగా కురుస్తున్న వర్షాలతో రైతులు తీవ్ర ఆందోళన చెందుతున్నారు. మండలంలో మినుము, పొగాకు, మిర్చి, శనగ పంటలు ఎక్కువగా సాగు చేశారు. మూడు రోజులుగా కురుస్తున్న వర్షాలకు పైర్లు జల సమాధి అయ్యాయి. ఈ తుఫాన్ మరో రెండు రోజులపాటు ఉందని వాతావరణశాఖ హెచ్చరిస్తుండడంతో రైతులు తీవ్ర ఆందోళనకు గురవుతున్నారు. ముఖ్యంగా మినుము పంట పూత దశంలో ఉండడంతో ఈ వర్షాల వల్ల తీవ్రంగా నష్టపోతామని ఆందోళన చెందుతున్నారు. మిర్చి, పొగాకు తోటలకు అపారమైన నాష్టం వాటిల్లుతుందని రైతులు మనోవేదనకు గురవుతున్నారు. వ్యవసాయశాఖ అధికారులు గ్రామాల్లో పంటలను పరిశీలించి పరిహారం అందించాలని రైతులు కోరుతున్నారు.

పొదిలి: పొదిలి మండలంలో వరుసగా గత మూడు రోజులుగా మాండూస్ తుఫాన్ ప్రభావంతో ఎడతెరపి లేకుండా కురుస్తున్న వర్షాలు పంటలను తీవ్రంగా నష్టపరుస్తున్నాయి. ముఖ్యంగా పూత దశలో ఉన్న కంది పంట పూర్తిగా దెబ్బతిన్నదని మండల రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఈ ఏడాది మండలంలో అత్యధికంగా వేల ఎకరాల్లో సాగు చేసిన కంది పంటతో పాటు ఇతర పంటలు వేశారు. అయితే ప్రస్తుతం పూత దశలో ఉన్న కందికి తుఫాను ప్రభావంతో మూడు రోజులుగా ముసురుకున్న వర్షం, ఎడతెరిపి లేకుండా పడుతున్న జడివానకు పూత రాలిపోయింది. గత ఏడాది లాగే ఈ సంవత్సరం దిగుబడి తగ్గే ప్రమాదం ఏర్పడిందని రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. వరుసగా మూడు సంవత్సరాల పాటు పంటలు చేతికి అందివచ్చే దశలో వరుస తుఫాన్లు దెబ్బ తీస్తున్నాయని ఆవేదన చెందుతున్నారు. కాగా తుఫాన్ కారణంగా గత మూడు రోజులుగా వదలని వర్షంతో పాటు ఆదివారం భారీ వర్షం కురిసింది. ఈ వర్షాలకు చుట్టుపక్కల వాగులు పొంగగా అక్కడక్కడా పంటలు నీట మునిగాయి. పట్టణంలో భారీ వర్షం వల్ల రోడ్లపైకి చేరిన వర్షపు నీరు వాహనదారులు మరియు పట్టణ ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. కాలనీలో వర్షపు నీరు నిల్వ ఉండడంతో పాటు ఎక్కడికక్కడ మురుగు కాలువల్లో ప్రవాహం ఆగిపోవడంతో మురుగునీరు రహదారులపై చేరింది.



జరుగుమల్లిలో మినుము పంటను పరిశీలిస్తున్న వ్యవసాయాధికారి

గ్రానైట్ పరిశ్రమను ముంచెత్తిన వర్షపు నీరు

ప్రజాశక్తి-చీమకుర్తి

మాండూస్ తుఫాను వర్షపు నీరు మండలంలో ప్రధాన వనరైన గ్రానైట్ పరిశ్రమను ముంచెత్తింది. గత రెండు రోజులుగా కురుస్తున్న వర్షాల వలన గ్రానైట్ గనులు వర్షపు నీటితో నిండిపోతున్నాయి. గోల్డెన్, మిడ్‌వెష్టు, కృష్ణసాయి, పల్లవ, రాసన్, వీనస్, వర్ధిని లాంటి గనులు నీటితో నిండుతున్నాయి. దాదాపు 8 నుంచి 12 అడుగుల లోతు నీరు నిండింది. నీరును బయటకు తోడేందుకు 75, 100 హార్స్ పవర్ మోటార్లు వినియోగిస్తున్నారు. ఒక్కో క్వారీ దాదాపు 300 హార్స్ పవర్ మోటార్లు పెట్టి నీటిని బయటకు కొడుతున్నారు. గోల్డెన్ క్వారీలో 10 అడుగుల నీరు చేరింది. క్వారీలలోని నీరు బయటకు కొట్టడానికి దాదాపు వారం నుంచి పది రోజులు పట్టే అవకాశమున్నట్లు ఆయా కంపెనీల ప్రతినిధులు తెలిపారు. అసలే గ్రానైట్ పరిశ్రమ సంక్షోభంలో కొట్టుమిట్టాడుతున్న సమయంలో వరుస తుఫానులు యజమానులను నిద్ర పోనీయడం లేదు. ఈ క్రమంలో గనులు గత రెండు రోజులుగా వర్షాల వలన పనులు నిలిపి వేయడంతో కార్మికులు పనులు లేక నివాసాలలోనే ఉండిపోతున్నారు. గెలాక్సీ గ్రానైట్ పరిశ్రమ అంతర్జాతీయ మార్కెట్‌లోలో మార్కెట్ లేక సంక్షోభం ఎదుర్కొంటున్న సమయంలో ప్రభుత్వ విధానాలతోపాటు, ప్రకృతి వైపరీత్యాలు కూడా వెన్నాడుతుండడంతో యజమానులు, కార్మికులు అల్లాడుతున్నారు.



పనులు లేక డెన్లలో ఉండిపోయిన జాకీ కార్మికులు

పొలమంతా నీరే!

- భారీగా నష్టపోయిన రైతులు
- పంటలను పరిశీలించిన అధికారులు

ప్రజాశక్తి-శింగరాయకొండ

మాండూస్ తుఫాను దెబ్బకి చేతికొచ్చిన పంట పొలాల్లో అంతా వర్షపు నీరుగా మారిపోయింది. ఏ పొలం చూసినా వర్షపునీటితో నిండిపోయింది. చేతికొచ్చిన పంట రైతుకు చేజారిపోయింది. సింగరాయకొండ మండలంలో హుండూస్ తుఫాను ప్రభావంతో వర్షం కూడా అధిక సంఖ్యలో నమోదయింది. ఈ నేపథ్యంలోనే చేతికొచ్చిన పంట వర్షపు నీటిలో మునిగిపోయింది. శింగరాయకొండ మండలంలోని కనుమల్ల, కలికివాయి, శానంపూడి, పాత శింగరాయకొండ గ్రామ పంచాయతీల్లో మినుము పంట 700 ఎకరాల్లో నష్టం జరిగిందని చెబుతున్నారు. ఒక్క ఎకరాకు 15 వేల రూపాయలు నష్టం జరిగిందని వివరిస్తున్నారు. చేతికొచ్చే పంట ఇలా నీటిలో మునిగి మొలకెత్తడంతో రైతులు తల్లడిపోతున్నారు. అదేవిధంగా సింగరాయకొండ మండలంలో శనగ పంట కూడా 70 ఎకరాల్లో నష్టం జరిగిందని చెబుతున్నారు. 100 ఎకరాల్లో మిరప పంటకు నష్టం జరిగింది. వ్యవసాయ శాఖ అధికారులు ఈతముక్కల నిర్మల కుమారి కెవి శేషారెడ్డి మినుము పంటను పరిశీలించి ప్రభుత్వానికి సమాచారం తెలియజేస్తామని తెలిపారు. వర్షం దెబ్బకి బాగా నష్టం వాటిల్లిందని, అధికారులు ఆదుకోవాలని రైతులు అధికారులను కోరారు.

పెద్దదోర్నాల: గత రెండు రోజులుగా తుఫాన్ ప్రభావంతో వర్షాలు కురుస్తుండడంతో 48 గంటలుగా మిర్చి కల్లాల్లోని మిర్చిపై కప్పిన పట్టలు తీయకపోవడంతో దోర్నాల మండలంలో ఇటీవలే మిర్చి కోతలు ముమ్మరంగా మొదలయ్యాయి. చేతికొచ్చిన మిర్చి పంట కుళ్లిపోతాయని రైతులు తీవ్ర ఆందోళనకు గురవుతున్నారు. ఒకవైపు తీవ్రమైన పెట్టుబడులతో, మరోవైపు తుఫాను ప్రభావంతో కోసిన కాయలు కుళ్లిపోతాయనే ప్రభావంతో మండలంలోని పలు గ్రామాల ప్రజలు ఆందోళనకు గురవుతున్నారు.

కొండపి: మాండూస్ తుపాన్ కారణంగా గత రెండు రోజుల నుంచి కురుస్తున్న వర్షాలతో రైతాంగాన్ని నిలువునా ముంచేసింది. ప్రతి పంట నీటమునగడంతో రైతులు అందరు కన్నీరు మున్నీరు అవుతున్నారు. ఎటుచూసినా పంటలన్నీ నీటమునిగి చెరువులను తలపిస్తున్నాయి. మండలంలో మిర్చి, పొగాకు, శనగ, మినుము, బొబ్బర్లు తదితర పంటలు సాగుచేశారు. ప్రస్తుత వాతావరణ పరిస్థితుల్లో పంటలన్నీ నీటమునిగి చెరువులను తలపించడంతో ఏ పంట చేతికి వచ్చే పరిస్థితి లేదని రైతులు బోరున విలపిస్తున్నారు. లక్షలాది రూపాయలు పెట్టుబడులు పెట్టారు. కట్టావారిపాలెం గ్రామానికి చెందిన మామిళ్లపల్లి నారాయణ తన 3 ఎకరాలలో వేసిన బొప్పాయి పంట మాండూస్ తుపాన్ వల్ల పూర్తి స్థాయిలో దెబ్బతినింది. ఇప్పటి వరకు బొప్పాయి తోటలకు రూ.2 లక్షల వరకు పెట్టుబడిపెట్టానని రైతు తెలిపారు. ముందస్తుగా వేసిన పొగాకు కొట్టుడుకు వచ్చే సమయానికి తుపాన్ వచ్చిందని, ఈ కారణంగా పొగాకు ఆకుపై ఉండే మడ్డి అంతా పోతుందని, రంగు వచ్చే అవకాశం ఉండదని పొగాకు రైతులు ఆందోళన చెందుతున్నారు. లక్షలలో పెట్టుబడి పెట్టి వేసిన పంటలన్నీ తుపాన్ కారణంగా పూర్తిస్థాయిలో దెబ్బతిన్నాయి. ఏపంటలు పనికి వచ్చే పరిస్థితి లేదని రైతాంగం ఆందోళన చెందుతున్నారు. వెంటనే పంటల నష్టాన్ని అంచనా వేసి నష్టపరిహారంతో పాటు తిరిగి వ్యవసాయం చేయడానికి ఉచితంగా ప్రభుత్వమే విత్తనాలు అందచేసి రైతాంగాన్ని ఆదుకోవాలని వారు కోరుతున్నారు.

శింగరాయకొండ: మాండుస్ తుఫాను తీరం దాటినప్పటికీ ఆ ప్రభావంతో రెండు రోజుల నుంచి భారీ వర్షాలు కురుస్తున్నాయి. సింగరాయకొండలో 99.6 మిల్లీమీటర్ల వర్షం నమోదయింది. దీంతో మత్స్యకారులు సముద్రం వేటను పూర్తిగా నిలిపివేసి బోట్లను సముద్రం ఒడ్డున వదిలేశారు. వర్షపు నీటిలో బోట్లు వేలాడుతున్నాయి. సింగరాయకొండ ఆర్‌టిసి బస్టాండ్ పరిస్థితి దారుణంగా ఉంది. బస్టాండు ప్రాంగణం ఒక చిన్న చెరువులా మారిపోయింది. బస్టాండ్‌లోకి వెళ్లాలంటే ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. వర్షం దెబ్బకు ప్రజలు తీవ్ర అవస్థలు ఎదుర్కొంటున్నారు.

దరిశి: దరిశి ప్రాంతంలో మాండూస్ తుఫాన్ కారణంగా రెండు రోజులుగా కురుస్తున్న భారీ వర్షాలకు పొగాకు, వరి పంటలు, మిరప తోటలు పంటలకు నష్టం వాటిల్లింది. దరిశి మండలంలో చందలూరు, బసిరెడ్డిపల్లి, తుమ్మెదలపాడు, బండివెలిగండ్ల, మాదిరెడ్డిపల్లి గ్రామాలలో వైట్‌బర్లీ పొగాకుకు అక్కడక్కడా నష్టం వాటిల్లింది. సుమారు 300 హెక్టార్లలో పొగాకు సాగు చేయగా ఇప్పుడిప్పుడే రైతులకు పొగాకు పంట చేతికి వచ్చి పొగాకును గుచ్చి ఎండబెట్టే సమయంలో తుఫాన్ రావడంతో వైట్‌బర్లీ పొగాకును నష్టపోయామని చందలూరు గ్రామానికి చెందిన నాగేశ్వరరావు, వెంకటేశ్వర్లు తెలిపారు. ఈవిధంగా పలు గ్రామాలలో కూడా పొగాకు పంటకు నష్టం వాటిల్లింది. తాళ్లూరు మండలంలో గంగవరం, నాగంబొట్లవారిపాలెం, లక్కవరం, వెలుగువారిపాలెం గ్రామాలలో ముందుగా నాటి వరి పంటను కోసి ఒద్దెలు వేయగా వర్షానికి తడిసి పోయాయి. మండల వ్యవసాయాధికారి ప్రసాదరావు అంచనా ప్రకారం 195 ఎకరాలలో వరి కోసి కుప్పలు వేశారని దీంతో రైతులకు 50 శాతం పైగా నష్టం జరిగిందన్నారు. ఈ తుఫాన్ ఇప్పటికైనా ఆగిపోతే ఉప్పు బియ్యానికైనా పనికి వస్తాయని ఆయన తెలిపారు. దరిశిప్రాంతంలో ముందుగా వేసిన బోర్ల కింద వరి కోత దశలో ఉండటంతో కోట్లాది రూపాయలు నష్టం వాటిల్లింది. నష్టపోయిన రైతులను ప్రభుత్వం ఆదుకోవాలని ఈ ప్రాంత రైతులు కోరుతున్నారు.

పొదిలి: పొదిలి మండలంలో వరుసగా గత మూడు రోజులుగా మాండ్యూస్ తుఫాన్ ప్రభావంతో ఎడతెరపి లేకుండా కురుస్తున్న వర్షాలు పంటలను తీవ్రంగా నష్టపరుస్తున్నాయి. ముఖ్యంగా పూత దశలో ఉన్న కంది పంట పూర్తిగా దెబ్బతిన్నదని మండల రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఈ ఏడాది మండలంలో అత్యధికంగా వేల ఎకరాల్లో సాగు చేసిన కంది పంటతో పాటు ఇతర పంటలు వేశారు. అయితే ప్రస్తుతం పూత దశలో ఉన్న కందికి తుఫాను ప్రభావంతో మూడు రోజులుగా ముసురుకున్న వర్షం, ఎడతెరిపి లేకుండా పడుతున్న జడి వానకు పూత రాలిపోయింది. గత ఏడాది లాగే ఈ సంవత్సరం దిగుబడి తగ్గే ప్రమాదం ఏర్పడిందని రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. వరుసగా మూడు సంవత్సరాల పాటు పంటలు చేతికి అందివచ్చే దశలో వరుస తుఫాన్లు దెబ్బతీస్తున్నాయని ఆవేదన చెందుతున్నారు. కాగా తుఫాన్ కారణంగా గత మూడు రోజులుగా వదలని వర్షంతో పాటు ఆదివారం భారీ వర్షం కురిసింది. ఈ వర్షాలకు చుట్టుపక్కల వాగులు పొంగగా అక్కడక్కడ పంటలు నీట మునిగాయి. పట్టణంలో భారీ వర్షం వల్ల రోడ్లపైకి చేరిన వర్షపు నీటితో వాహనదారులు, పట్టణ ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. కాలనీలో వర్షపు నీరు నిల్వ ఉండడంతో పాటు ఎక్కడికి ఎక్కడ మురుగు కాలువలు ఆగిపోవడంతో రహదారులపై మురుగునీరు చేరింది.

కొనకనమిట్ల: తుఫాను ప్రభావంతో గత మూడు రోజులుగా కురుస్తున్న వర్షాలకు పంటలన్నీ నీటమునిగాయి. ఆరుగాలం కష్టించి శ్రమించి సాగు చేసిన పంటలు తమ కళ్లదుటే నీటిలో మునగడంతో రైతులు దిక్కు తోచని స్థితిలో ఉన్నారు. చేతికి వచ్చిన పంట చేజారి పోతోందని కొందరు, పంటలకు తెచ్చిన అప్పులు ఎట్లా తీర్చాలని మరికొందరు ఆందోళన చెందుతున్నారు. ముందస్తుగా సాగుచేసిన బొబ్బర్లు, మినుము పూర్తిగా దెబ్బతిని మొలకలు కూడా వచ్చిన పరిస్థితి. ప్రభుత్వం రైతులను ఆదుకోవాలని అభ్యర్థిస్తున్నారు. బొబ్బర్లు, మినుముకు ఒక్కొక్క ఎకరానికి పెట్టుబడి 25 వేల నుంచి రూ.30 వేల వరకు అయిందని రైతులు వాపోతున్నారు. మండలంలోని సిద్దవరం, బచ్చల కూరపాడు, పాతపాడు, గర్మిని పెంట, గొట్టగట్టు, సినమన గుండం గ్రామాలలో బొబ్బర్లు, మినుము రెండుసార్లు సాగు చేసిన పరిస్థితి. పూత పిందె దశకు వచ్చిన కంది పంట నిలువునా నీట మునిగిపోయింది. పొగాకు పంట కూడా నీట మునిగింది. గనివెనపాడు, వాగుమడుగు గ్రామంలో బర్లి పొగాకు బాగా దెబ్బతిన్నది.

లోతట్టు ప్రాంతాలు జలమయం

మండలంలోని లోతట్టు ప్రాంతాలు జలమయమయ్యాయి. ఎక్కడ నీరు అక్కడే నిలిచిపోవడంతో బయటకు వెళ్లే మార్గాలు లేక ఇళ్లల్లోకి నీరు చేరింది. అంతర్గత రహదారులన్నిటినీ వాన నీరు కప్పేసింది. గనివెనపాడు, కొనకనమిట్ల ఎస్సీ కాలనీల్లోకి నీరు చేరాయి. గతంలో నిర్మించుకున్న పాత ఇళ్లు కారుతున్నాయి. ఏర్పాటు చేయకపోవడంతో రోడ్లమీద పడ్డ నీరు ఇళ్లల్లోకి చేరింది. కాలనీల వాసుల బాధలు వర్ణనాతీతం.

పామూరు: తుఫాన్ కారణంగా గత మూడు రోజుల నుంచి కురుస్తున్న వర్షానికి శనగ, మినుము పూర్తిగా దెబ్బతినడంతో రైతులకు తీవ్ర నష్టం వాటిల్లినది. పంట చేతికి వచ్చే సమయంలో ప్రకృతి వర్షం రావడం రైతులకు శాపంగా మారింది. మండలంలోని బోడవాడ, కంభాలదిన్నె, కట్టకిందపల్లి, వగ్గంపల్లి ప్రాంతాలలో మినుము, శనగ పంటలు రైతులు అధికంగా సాగు చేశారు. ప్రభుత్వం వెంటనే పంట నష్టపరిహారాన్ని అంచనా వేసి రైతులను ఆదుకోవాలని రైతు దొడ్డా వెంకటరత్నం, రైతు నాయకులు వీరనారాయణ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.

గిద్దలూరు రూరల్: గత రెండు రోజుల నుంచి మాండూస్ తుఫాను ప్రభావం వలన ఎడతెరపి లేకుండా కురుస్తున్న వర్షాలకు గిద్దలూరు మండలంలో వివిధ పంటలు దెబ్బతిన్నట్లు మండల వ్యవసాయ అధికారి విజయ భాస్కర్‌రెడ్డి తెలిపారు. ప్రాథమిక అంచనా ప్రకారం సుమారుగా 150 ఎకరాల్లో వరి, 1200 ఎకరాల్లో శనగ, 600ఎకరాల్లో పొగాకు మొత్తంగా 1950 ఎకరాల్లో పంటలు పాడైనట్లు ఎఒ తెలిపారు. పత్తి పైరు పొలంలో నీరు నిలబడి ఉన్నట్లయితే నీటిని బయటకు పంపి మొక్కలు ఉరకెత్తకుండా ఉండటానికి 19:19:19 మందుని లీటరు నీటికి 10 గ్రాముల చొప్పున 5 నుంచి 7 రోజుల వ్యవధిలో 2 సార్లు పిచికారీ చేసుకోవాలని, వర్షపు నీరు పొలంలో నిల్వ ఉండుటవలన కాయ రాలిపోయే అవకాశం ఉన్నందున నివారణకు లీటరు నీటికి 2 మి.లీ ప్లానోఫిక్స్ మందుని పిచికారీ చేసుకోవాలని, కంది పైరులో నీరు నిల్వ ఉన్నట్లయితే నీటిని తీసివేసి 10 గ్రాముల పొటాషియం నైట్రేట్, కార్బన్డైజెమ్, మాంకోజేబ్‌లను కలిపి పిచికారీ చేయాలన్నారు. శనగ పొలంలో నీరు నిల్వ తీసివేసి పొటాషియం నైట్రేట్ పిచికారీ చేసుకోవాలని తెలిపారు. మిరప పైరులో సూక్ష్మ ధాతు లోపాలు వచ్చే అవకాశం ఉన్నందున సూక్ష్మ పోషకాల మిశ్రమం పిచికారీ చేయాలని ఆయన రైతులకు సూచించారు.

పిసిపల్లి: మాండూస్ తూఫాన్‌తో శుక్రవారం నుంచి కురిసిన వర్షాలకు అపార నష్టం వాటిల్లింది. సుమారు 2వేల ఎకరాల్లో కంది పూత రాలి ఒంగిపోయింది. 50 ఎకరాల్లో పత్తి పొలాల్లో నీరు చేరింది. 200 ఎకరాల్లో మిర్చి కోత దశలో ఉండడంతో నేలకు ఆని మిరపకాయలు తెల్లబారిపోయాయి. కోత దశలో ఉన్న మినుము పంట 400 ఎకరాల్లోని కాయలు మొలకెత్తుతున్నాయి. ఈ విధంగా మండలం లోని కంది, పత్తి, మినుము, మిరప రైతులు తీవ్రంగా నష్టపోయారు. ప్రభుత్వం నష్టం అంచనాలు వేసి నష్టపరిహారం అందించాలని ముగురు గుమ్మి సర్పంచి సతీష్ కోరారు. మండలం మొత్తం మీద నేరేడుపల్లి, పెదఅల వలపాడు, పిసిపల్లి, గుంటుపల్లి, పెదఒరిమడుగు, తలకొండపాడు పంచాయతీల్లో పంట తీవ్ర స్థాయిలో దెబ్బతింది. ఇదే పరిస్థితి మరో రెండు కొనసాగితే ఎకరం కూడా రైతులకు దక్కే పరిస్థితి లేదు.

నీట మునిగిన మినుము పంట

ప్రజాశక్తి-వెలిగండ్ల

మాండూస్ తుఫాను ప్రభావంతో శుక్రవారం సాయంత్రం నుంచి కురిసిన వర్షాలకు వెలిగండ్ల మండలంలోని మినుము రైతులు పూర్తిగా నష్టపోయారు. మండలంలో మొత్తం నాలుగు వేల ఎకరాల మినుము పంట సాగు చేయగా, 2000 ఎకరాల పంట పచ్చికాయ దశలో ఉంది. మిగతా 2000 ఎకరాల్లో కాయకు వచ్చి కోత కోసే సమయంలో ఈ వర్ష ప్రభావం వల్ల పంట నీట మునిగి ఎండికుపోయిన కాయలు పగిలి మొలక దశకు చేరాయి. దీంతో ఒకటి రెండు రోజులు ఇళ్లకు చేరే పంట వర్షా ప్రభావంతో పూర్తిగా నష్టపోయారు. మండలంలోని పందువ నాగుల వరం, హుస్సేన్ పురం, గన్నవరం, రామగోపాలపురం, కంకణంపాడు, వెలిగండ్ల, మొగులూరు గ్రామాలలో ఎక్కువగా రైతులు మినుము పంటను పండించారు. ఎకరాకు నాలుగు క్వింటాళ్లు పంట రాగా, ఒక క్వింటాకు 20వేల రూపాయలు నష్టం వాటిల్లింది. 20 శాతం మంది రైతులే పంటను ఇంటికి తీసుకొచ్చారు. పండించిన పంటలో 80 శాతం వరకు రైతులు నష్టపోయారు. అంటే 1800 ఎకరాల్లో నష్టం వాటిల్లింది. ఎకరాకు 20,000 వంతున 1800 ఎకరాలకు మూడు కోట్ల 60 లక్షల నష్టం వాటిల్లినట్టు రైతులు చెబుతున్నారు. వెంటనే వ్యవసాయ అధికారులు నష్టపరిహారాన్ని అంచనా వేసి ప్రభుత్వం ద్వారా రైతులకు నష్టపరిహారం అందించాల్సిన అవసరం ఎంతైనా ఉందని మండలంలోని రైతులు వాపోతున్నారు.

నష్టపోయిన రైతులను ప్రభుత్వం ఆదుకోవాలి: కేలం ఇంద్రభూపాల్‌రెడ్డి


మాండూస్ తుఫాను వల్ల శుక్రవారం నుంచి కురుస్తున్న వర్షాలకు కనిగిరి నియోజకవర్గంలోని రైతులు పంటలను పూర్తిగా నష్టపోయారని వ్యవసాయాధికారులు నష్టపరిహారం అంచనా వేసి ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి వెంటనే వారిని ఆదుకోవాలని కనిగిరి నియోజకవర్గ తెలుగుదేశం పార్టీ రైతు విభాగం అధ్యక్షుడు కేలం ఇంద్రభూపాల్‌రెడ్డి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ తుఫాను వల్ల కంది, మినుము పంటలు పూర్తిగా నీటమునిగాయని దీంతో రైతులు ఎకరానికి 20వేల వంతున నష్టపోయారని ఆవేదన తెలిపారు. మినుము పంట ఎండు కాయ దశలో ఉండగా ఈ వర్షానికి కాయలు పగిలి మొలకలు వచ్చాయని, దీనితో ఇంటికి చేర్చుకునే సమయంలో వర్షాల వల్ల ఒక్కొక్క రైతు సుమారు లక్ష నుంచి నాలుగు ఐదు లక్షలు దాకా నష్టపోయారని తెలిపారు. ఒక్క వెలిగండ్ల మండలంలోని మినుము పంట నీట మునగటంతో దాదాపు 20 కోట్ల రూపాయల వరకు రైతులకు నష్టం వాటిల్లిందని పేర్కొన్నారు. అలాగే ఆరు మండలాల్లో ఈ విధమైన నష్టం సుమారుగా 100 కోట్ల రూపాయల మేర జరిగిందని, ప్రభుత్వం వెంటనే వారిని ఆదుకోవాలని డిమాండ్ చేశారు.



వెలిగండ్ల మండలంలో నీట మునిగిన మినుము పంట



దర్శిలో దెబ్బతిన్న వర్జీనియా పొగాకు



శింగరాయకొండలో వర్షపు నీటిలో బోటు



గిద్దలూరులో వరద నీటి నుంచి పైరును కాపాడుకునే ప్రయత్నంలో రైతులు

ఎస్‌ఎఫ్‌ఐ మహాసభల పోస్టర్ ఆవిష్కరణ

ప్రజాశక్తి-బాపట్ల రూరల్

ఎస్‌ఎఫ్‌ఐ 17వ అఖిల భారత మహాసభల పోస్టర్ స్థానిక ఎంసి జూనియర్ కళాశాలలో ఆదివారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఎస్‌ఎఫ్‌ఐ బాపట్ల జిల్లా అధ్యక్ష కార్యదర్శులు పి. మనోజ్ కుమార్, బి. ఆర్య మాట్లాడుతూ అందరికీ విద్య, అందరికీ ఉద్యోగం, అందరూ సమానత్వంగా ఉండాలని నినాదంతో ఎస్‌ఎఫ్‌ఐ అఖిలభారత మహాసభలు తెలంగాణా రాష్ట్రంలోని ఉస్మానియా యూనివర్సిటీలో ఈనెల 13 నుంచి 16 వరకూ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ మహాసభలకు దేశవ్యాప్తంగా అన్ని రాష్ట్రాలు, కేంద్ర పాలిత ప్రాంతాలు, సెంట్రల్ యూనివర్సిటీల నుంచి ఎంపిక చేసిన ప్రతినిధులు హాజరవుతున్నారు. బిజెపి ప్రభుత్వం రెండో సారి అధికారంలోకి వచ్చిన తర్వాత విద్యారంగంలో సంస్కరణలు పేరుతో ప్రభుత్వ విద్యను పేద ప్రజలకు దూరం చేసే విధంగా నూతన జాతీయ విద్యా విధానానికి కల్పన చేశారని తెలిపారు. ప్రభుత్వ రంగ సంస్థల ప్రైవేటీకరణను వేగవంతం చేశారని తెలిపారు. ఫలితంగా దేశంలో నిరుద్యోగం పెరిగిపోయిందన్నారు. పాఠ్యాంశాలలో మత పరమైన అంశాలను చొప్పిస్తూ దేశ స్వాతంత్రం కోసం పోరాడి అమరులైన వీరుల జీవిత చరిత్రను తొలగిస్తున్నారని తెలిపారు. దేశంలో ప్రజాస్వామ్యం లేకుండా చేస్తున్నారని తెలిపారు. ఈ విషయాలపై మహాసభలో చర్చించి భవిష్యత్ కార్యాచరణను రూపొందించుకోవడం కోసం ఉస్మానియా యూనివర్సిటీ వేదిక కానున్నట్లు తెలిపారు. మహాసభల ప్రారంభం సందర్భంగా ఈనెల 13న విద్యార్థి ప్రదర్శన. భారీ బహిరంగ సభ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఎస్‌ఎఫ్‌ఐ ఫౌండర్ మెంబర్ త్రిపుర మాజీ ముఖ్యమంత్రి మాణిక్ సర్కార్ హాజరుకానున్నట్లు తెలిపారు. బాపట్ల జిల్లా ప్రాంతం నుంచి ఎస్‌ఎఫ్‌ఐ శ్రేయోభిలాషులు బహిరంగ సభలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. పోస్టర్ ఆవిష్కరణలో ఎస్‌ఎఫ్‌ఐ జిల్లా నాయకులు నాగలక్ష్మి, అలేఖ్య, వివిధ కళాశాల విద్యార్థులు పాల్గొన్నారు.



పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న ఎస్‌ఎఫ్‌ఐ నాయకులు

బూదవాడ విద్యార్థులకు ప్రథమ స్థానం

ప్రజాశక్తి-పంగులూరు

జిల్లా స్థాయి చెకుముకి పోటీల్లో తమ విద్యార్థులు పథమ స్థానంలో నిలిచి రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైనట్లు మండల పరిధిలోని బూదవాడ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు ఇమ్మడిశెట్టి అనిత తెలిపారు. చీరాలలో ఆదివారం జిల్లా స్థాయి చెకుముకి పోటీలు నిర్వహించారు. ఈ పోటీల్లో బూదవాడ పాఠశాలకు చెందిన బి. దివ్య, బి . శివాని, ఆర్. మనస్విని 50/45 మార్కులు సాధించి ప్రథమ స్థానంలో నిలిచాయి. ఎ.తన్మయి, ఎస్‌వి. ప్రార్థసాయి, వై.ప్రణీత 44 మార్కులతో ద్వితీయ స్థానంలో నిలిచారు. జి. కోకిల్ నాయుడు, సిహెచ్. శ్రీధర్, కెవి. సాయి చరణ్ 39 మార్కులతో తతీయ స్థానంలో నిలిచినట్లు ప్రధానోపాధ్యాయురాలు అనిత తెలిపారు. ప్రథమ స్థానం సాధించిన విద్యార్థులను పాఠశాల ప్రధానోపాధ్యా యురాలు, ఉపాధ్యా యులు, గ్రామపెద్దలు అభినందించారు.


బహుమతి అందుకుంటున్న విద్యార్థులు


రైతు జెండాను ఆవిష్కరిస్తున్న నాయకులు

గ్రామాల్లో ఎమ్మెల్యే ఏలూరి పర్యటన

ప్రజాశక్తి-పర్చూరు

టిడిపి బాపట్ల పార్లమెంట్ అధ్యక్షుడు, ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు మండలంలో ఆదివారం విస్తతంగా పర్యటించారు. తొలుత కోమరనేని వారిపాలెంలో ఎర్ర సుబ్బారావు మనవరాలి ఓణిల వేడుకకు హాజరై చిన్నారిని ఆశీర్వదించారు. అనంతరం వీరన్నపాలెం గ్రామానికి చెందిన తవ్వ సుబ్బారావును పరామర్శించి ఆయన ఆరోగ్య పరిస్థితి గురించి అడిగి తెలుసుకున్నారు. అవేవిధంగా చిట్టినేని వీరయ్య కుటుంబ సభ్యులను పరామర్శించారు. మనం విజయ్ కుటుంబ సభ్యులను ఓదార్చరు. గోరంట్ల రాఘవేందర్రావును పరామర్శించారు. సోమేపల్లి రాఘవయ్య, కొల్లా వాసు, దుబ్బ అనిల్ కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఈ కార్యక్రమంలో టిడిపి రాష్ట్ర కార్యదర్శి సలగల రాజశేఖర్ బాబు, టిడిపి మండల అధ్యక్షుడు షేక్ సంసుద్దీన్, మానంహరి బాబు, ఎంపీటీసీ పుల్లెల పద్మ, మక్కెన శేఖర్ బాబు, హరికష్ణ, అగ్ని గుండాల వెంకటకష్ణ, కామినేని జనార్ధన్, హుస్సేన్,నాగరాజు సురేష్, శ్యామ్, రాజు తదితరులు పాల్గొన్నారు.

రైతు సంఘం జెండా ఆవిష్కరణ

ప్రజాశక్తి - పంగులూరు

కేరళలో ఆల్ ఇండియా కిసాన్ సభ జాతీయ మహాసభలు నిర్వహిస్తున్నారు. అందులో భాగంగా రైతు సంఘం జెండాను రైతు సంఘం బాపట్ల జిల్లా కార్యదర్శి తలపనేని రామారావు ఆదివారం ఆష్కరించారు. ఈ సందర్భంగా రామారావు మాట్లాడుతూ రైతులు ఎదుర్కొంటున్న సమస్యలను దష్టిలో ఉంచుకొని రాష్ట్రంలో రైతు సంఘాన్ని ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఈ సంఘం ద్వారా పత్తి రైతుల ఉద్యమాన్ని, సాగర్ నీటి కోసం పోరాటం, పంటలకు గిట్టుబాటు ధరల కోసం, బ్యాంకులో బంగారు వేలం ఆపడం కోసం, శనగ రైతులకు బోనస్ కోసం అనేక పోరాటాలు చేసి విజయం సాధించినట్లు తెలిపారు. దేశవ్యాప్తంగా ఏడాదిపైగా ఢిల్లీ మహానగరంలో ఉద్యమాన్ని చేసి కేంద్ర ప్రభుత్వం మెడలు వంచి రైతు వ్యతిరేక చట్టాలను రద్దు చేయించినట్లు తెలిపారు. కౌలు రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు రాయిని వినోద్ బాబు మాట్లాడుతూ రైతు సంఘం ఆధ్వర్యంలో ఈ ప్రాంతంలో అనేక బలమైన ఉద్యమాలు నిర్వహించినట్లు తెలిపారు. రైతులు రైతు సంఘానికి అండగా నిలిచి ఉద్యమాలకు ఊపిరి పోసారని చెప్పారు. వ్యవసాయ మోటార్లకు మీటర్ల బిగించాలనే ప్రభుత్వ విధానాన్ని రైతాంగం తిప్పి కొట్టాలన్నారు. రైతు సంఘం భవిష్యత్‌లో చేపట్టే ఉద్యమాలకు రైతులు తమ వంతు సహకారం అందించాలన్నారు. ఉద్యమాన్ని ముందుకు నడపడంలో ముందుండాలని ఆయన కోరారు. ఈ కార్యక్రవంలో రైతు సంఘం కార్యకర్తలు తలపనేని సుబ్బారావు, పోతుగంటి ఆదుం సాహెబ్, గల్లా సుబ్బారావు, రాయిని బుచ్చయ్య, ఏనికపాటి సుబ్బారావు, బాచిన సుబ్బారావు, కొల్లా వెంకటేశ్వర్లు, కనకయ్య, మస్తాన్, అడకా ఆంజనేయులు, వెంకట్రావు, చిలుకూరి హనుమంతరావు తదితరులు పాల్గొన్నారు.


ఆదినారాయణ


సునీల్ కుమార్

యుటిఎఫ్ నూతన కమిటీఎన్నిక

అధ్యక్ష కార్యదర్శులుగా ఆదినారాయణ,సునీల్ కుమార్

ప్రజాశక్తి - మార్టూరు రూరల్

స్థానిక విశ్రాంత ఉద్యోగుల సంఘం కార్యాలయంలో యుటిఎఫ్ నూతన కార్యవర్గాన్ని ఆదివారం ఎన్నుకున్నారు. యుటీఎఫ్ మండల అధ్యక్ష కార్యదర్శులుగా బండారు ఆదినారాయణ, పోపూరి సునీల్ కుమార్ మరోసారి ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. యుటిఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి అడుగుల శ్రీనివాసరావు, ఎన్నికల అధికారి యుటిఎఫ్ జిల్లా కార్యదర్శి పాలపర్తి రామాంజనేయులు ఆధ్వర్యంలో నూతన కమిటీని ఎన్నుకున్నారు. గౌరవా అధ్యక్షుడిగా బి.ప్రతాప్ కుమార్, కోశాధికారిగా జానీబాషా ఉపాధ్యక్షులుగా సూర్యప్రకాష్, అమతవల్లి, జిల్లా కౌన్సిలర్లుగా ఆదినారాయణ, పి. సునీల్,కె. రంగస్వామి, షేక్ షబ్బీర్ పి.నారాయణరెడ్డి,వి.రామాంజలి, కార్య దర్శులుగా తాజుద్దీన్,ప్రశాంత్, అన్నపూర్ణ, చట్టి శ్రీనివాసరావు, రాంనాయక్, పేరయ్య, రామాంజనేయులు, చార్లీ బెంజిమెన్, మధుశ్రీ ఎన్నికయ్యారు. నూతన కమిటీని పలువురు అభినందించారు. ఈ కార్యక్రమంలో యుటిఎఫ్ నాయకులు కందిమళ్ళ రవి బాబు, శ్రీపతి వెంకట సుబ్బయ్య, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థినికి అభినందనలు

వెలిగండ్ల : మొగుళ్ళూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థి పల్నాటి స్నేహరెడ్డి ఆంధ్రప్రదేశ్ స్టేట్ లెవెల్ సైన్స్ కాంగ్రెస్‌లో పాల్గొని 30వ నేషనల్ చిల్డ్రన్స్ సైన్స్ కాంగ్రెస్‌కు రాష్ట్రం నుంచి నేషనల్ లెవెల్‌కు ఎంపికైంది. ఈ సందర్భంగా పాఠశాల ప్రధానోపాధ్యాయుడు రాజాల కొండారెడ్డి, ఉపాధ్యాయులు ఒంగోలు వెంకటేశ్వర్లు, జి.వెంకట్రావు, షేక్ ఖాదర్‌మొహిద్దీన్, ఆర్.శ్రీనివాసులు, ఎం.ప్రసాద్, కోటిరెడ్డి, ఖాసీం, తిరుపతిరెడ్డి, వేంకటేశ్వర్లు, ప్రసాద్, ఆంజనేయులు, పార్వతమ్మ, పవన్, సుబ్బారెడ్డి తదితరులు స్నేహరెడ్డికి ఆదివారం అభినందలు తెలిపారు.


కంటి పరీక్షలు నిర్వహిస్తున్న వైద్యసిబ్బంది

500 మందికి కంటి పరీక్షలు

ఇంకొల్లు రూరల్ : పేదలకు కంటి చూపు అందిస్తున్న వెలుగు ప్రధాతగా ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు నిలిచారని టిడిపి రాష్ట్ర కార్యదర్శి సలగల రాజశేఖర్ బాబు అన్నారు. మండల పరిధిలోని పావులూరు గ్రామంలో ఏలూరి చారిటబుల్ ట్రస్ట్, నోవా అగ్రి గ్రూప్స్ ఆధ్వర్యంలో శంకర్ కంటి ఆసుపత్రి, అంధత్వ నివారణ సంస్థ సౌజన్యంతో ఆదివారం ఉచిత మెగా కంటి వైద్య శిబిరం నిర్వహించారు. ఈ వైద్యశిబిరానికి 500 మంది హాజరు కాగా అందులో 240 మందికి కంటి శస్త్ర చికిత్సలకు వైద్యులు సిఫార్సు చేశారు. అనంతరం అన్నదానం చేపట్టారు. ఈ కార్యక్రమంలో టిడిపి మండల అధ్యక్షుడు నాయుడు హనుమంతరావు, మాజీ జడ్‌పిటిసి వీరగంధం ఆంజనేయులు, గుంజి వెంకట్రావు, ఎస్‌సి సెల్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి దేవతోటి సుందర్ రావు, మండల రైతు అధ్యక్షుడు రాంబాబు, ఎస్‌సి సెల్ అధ్యక్షుడు బేతపూడి సురేష్, దేవతోటి నాగరాజు, పావులూరు గ్రామ శాఖ అధ్యక్షుడు బట్టు శ్రీను, అజయ్ బాబు పాల్గొన్నారు.

ప్రజల సంక్షేమమే ధ్యేయం

మాజీ ఎమ్మెల్సీ అన్నం సతీష్ ప్రభాకర్

బాపట్ల రూరల్ : తాను రాజకీయాలలో ఉన్నా లేక పోయినా ప్రజల సంక్షేమమే ధ్యేయంగా పనిచేస్తానని మాజీ ఎమ్మెల్సీ అన్నం సతీష్ ప్రభాకర్ తెలిపారు. నియోజక వర్గ ప్రజలు తనపై చూపిస్తున్న ఆదర అబి . మానాలను ఎప్పటికీ మర్చిపోనని తెలిపారు. అన్నం సతీష్ ప్రభాకర్ పుట్టిన రోజు సందర్భంగా పట్టణంలోని అంబేద్కర్ విగ్రహం వద్ద అభిమానులు ఏర్పాటు చేసిన కేకును ఆయన ఆదివారం కట్ చేసి అభిమానులకు పంచి పెట్టారు. అనంతరం సతీష్ మాట్లాడుతూ అనేక సంవత్సరాల పాటు తాను ప్రజలకు చేసిన సేవా కార్యక్రమాలే తనను ప్రజల గుండెల్లో నిలిచే విధంగా చేసిందన్నారు. రానున్న ఎన్నికలలో క్రియాశీలక రాజకీయాల్లో తప్పనిసరిగా ఉంటానని తెలిపారు. ఈ సందర్భంగా సతీష్ ప్రభాకర్‌కు పలువురు నాయకులు, కార్యకర్తలు ఆయనకు జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు.


మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్సీ సతీష్ ప్రభాకర్

పేదల సంక్షేమానికి కృషి : రావి

ప్రజాశక్తి-చిన్నగంజాం

పేదల సంక్షేమానికి ముఖ్యమంత్రి జగన్‌మోహన్ రెడ్డి కృషి చేస్తున్నట్లు వైసిపి పర్చూరు నియోజక వర్గ ఇన్‌ఛార్జి రావి రామనాథం బాబుతెలిపారు. మండల పరిధిలోని రాజు బంగారు పాలెం గ్రామ సచివాలయ పరిధిలో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామస్తులు రామనాథం బాబుకు ఘన స్వాగతం పలికారు. అనంతరం రామనాథం బాబు గడప గడపకూ తిరిగి ప్రజల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ప్రభుత్వ సంక్షేమ పథకాల గురించి ప్రజలకు వివరించారు. ఈ కార్యక్రమంలో వైసిపి నాయకులు, కార్యకర్తలు, వివిధ శాఖల అధికారులు, సచివాలయ సిబ్బంది, వైసిపి నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.


స్థానికులతో మాట్లాడుతున్న రామనాథం బాబు

డిగ్రీ సెమిస్టర్ ఫలితాలలో ప్రతిభ

అధికారులు అందుబాటులో ఉండాలి

మంత్రి సురేష్

ప్రజాశక్తి-యర్రగొండపాలెం


యర్రగొండపాలెం నియోజకవర్గంలో తుఫాను ప్రభావంతో ఎడతెరపి లేకుండా కురుస్తున్న వర్షాల నేపధ్యంలో అన్ని శాఖల అధికారులు అందుబాటులో ఉండాలని రాష్ట్ర పురపాలక, పట్టణాభివృద్ధి శాఖ మంత్రి డాక్టర్ ఆదిమూలపు సురేష్ ఆదేశించారు. ఆదివారం ఆయన క్యాంపు కార్యాయంలో అధికారులతో మాట్లాడారు. వర్షం ప్రభావంతో ఐదు మండలాల్లో నష్టాలపై ఆరా తీశారు. ఈ సందర్భంగా మంత్రి సురేష్ మాట్లాడుతూ కరుస్తున్న వర్షాల కారణంగా ఏఏ పంటకు నష్టం వాటిల్లనుందో వ్యవసాయ, ఉద్యాన శాఖాధికారులు పరిశీలించాలన్నారు. బాగా నష్టపోయిన పంటల అంచాలను తయారు చేయాలని సూచించారు. కార్యక్రమంలో ఏఎంసి చైర్మన్ ఉడుముల శ్రీనివాసరెడ్డి, త్రిపురాంతకం ఎంపిపి కోట్ల సుబ్బారెడ్డి, గంజివారిపల్లి సర్పంచ్ దుగ్గెంపూడి సుబ్బారెడ్డి, ఆదిత్య విద్యా సంస్థల కరస్పాండెంట్ ఎస్వి రమేష్ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న మంత్రి సురేష్

5,939 ఎకరాలలో పంట నష్టం: ఏవో

ప్రజాశక్తి-టంగుటూరు: తుపాను ప్రభావంతో ఎడతెరపి లేకుండా కురుస్తున్న వర్షానికి మండల పరిధిలోని 5,939 ఎకరాలలో వివిధ పంటలకు నష్టం సంభవించినట్లు ఎఒ జి.స్వర్ణలత తెలిపారు. మండలంలోని పలు గ్రామాలలో ఎఒ ఆదివారం పర్యటించారు. ఈ సందర్భంగా ఆమె వర్షాలకు దెబ్బతిన్న పలు పంటలను పరిశీలించారు. ఆమె మాట్లాడుతూ దెబ్బతిన్న పంట వివరాలపై నివేదిక తయారు చేయాలని రైతు భరోసా కేంద్రాల సిబ్బంది సూచించారు.



ఒంగోలు నగరంలో ఏ1 కల్యాణమండపంలో అడ్వకేట్ బొడ్డు భాస్కర్‌రావు కుమారుని వివాహం సందర్భంగా ఏర్పాటు చేసిన రిసెప్షన్ కార్యక్రమంలో పాల్గొన్న మాజీ ఎమ్మెల్యే దామచర్ల జనార్ధన్

ప్రజాశక్తి-ఒంగోలు కలెక్టరేట్

ఆచార్య నాగార్జున యూనివర్సిటీ గత అక్టోబర్‌లో నిర్వహించిన డిగ్రీ 2వ సెమిస్టర్ ఫలితాలు విడుదలయ్యాయి. ఈ ఫలితాలలో ప్రైవేట్ విద్యా సంస్థల విద్యార్థులు అత్యధిక మార్కులు సాధించారు. అత్యుత్తమ మార్కులు సాధించిన విద్యార్థినీ, విద్యార్థులను కళాశాల యాజమాన్యాలు అభినందించాయి.

'ప్రైవేట్' విద్యార్థులకు అత్యధిక మార్కులు

శ్రీహర్షిణికి అత్యధిక మార్కులు

డిగ్రీ రెండవ సెమిస్టర్ ఫలితాలలో ఒంగోలులోని శ్రీహర్షిని డిగ్రీ విద్యార్థులు అత్యధిక మార్కులు సాధించి యూనివర్సిటీ స్థాయిలో సత్తా చాటారు. ఎంఎస్‌సిఎస్ విభాగంలో ఏ.శ్రావణి 400కి 397 మార్కులు, ఎం.మధు భార్గవి 394 మార్కులు, టి.తనూజ 392 మార్కులతో ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాలు సాధించారు. ఉత్తమ మార్కులు సాధించిన విద్యార్థులను కళాశాల చైర్మన్ గోరంట్ల రవికుమార్, సెక్రటరీ, కరస్పాండెంట్ గోరంత కవిత, కళాశాల ప్రిన్సిపల్ దాది ఆంజనేయులు పిజి కోఆర్డినేటర్ శ్రీనివాసులు రెడ్డి అభినందించారు.



ఉత్తమ ఫలితాలు సాధించిన శ్రీహర్షిణీ విద్యార్థులు

శ్రీ సరస్వతీ విద్యార్థుల జయకేతనం

డిగ్రీ 2వ సెమిస్టర్ పరీక్షా ఫలితాలలో శ్రీ సరస్వతీ డిగ్రీ, పీజీ కళాశాల విద్యార్థులు జయకేతనం ఎగురవేశారు. ఆరవ సారి అత్యుత్తమ ఉత్తీర్ణత సాధించి అగ్రస్థానంలో నిలిచారు. జిల్లా స్థాయి ర్యాంకులు, అత్యధిక మార్కులు సాధించినవారిని కాలేజ్ చైర్మన్ ఏవి రమణా రెడ్డి అభినందించారు. కార్యక్రమంలో డైరెక్టర్స్ ఏ.గణేష్ రెడ్డి, ఏ.గంగా శంకర్ రెడ్డి, అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్ ఎన్. సురేష్, ప్రిన్సిపాల్ శ్రీనివాసరావు పాల్గొన్నారు.

డిగ్రీలో పిఎన్‌సిఏ విద్యార్థుల ప్రతిభ

శింగరాయకొండ: ఆచార్య నాగార్జున యూనివర్శిటీ రెండో సెమిస్టర్ ఫలితాలలో శింగరాయకొండలోని పిఎన్‌సిఏ డిగ్రీ కళాశాల విద్యార్థులు అత్యుత్తమ ఉత్తీర్ణతాశాతంతో పాటు యూనివర్శిటీ ర్యాంకులు సాధించినట్లు కళాశాల కరస్పాండెంట్ డాక్టర్ గీతారాణి ఆదివారం తెలిపారు. బిఎస్సీ కంప్యూటర్స్‌లో 87 శాతం ఉత్తీర్ణతతో పాటు రామలింగం రాధిక ఫిజిక్స్‌లో 100 శాతం, మ్యాథ్స్ 100 శాతం మార్కులు సాధించడంతో పాటు ఓవరాల్‌గా 97.25 శాతం మార్కులతో యూనివర్సిటీ ర్యాంక్ సాధించారు. ఉత్తమ ప్రతిభ కనపరచిన విద్యార్థులను కళాశాల చైర్మన్ పి.శ్రీనివాసరావు, ప్రిన్సిపాల్ డి.నాగేశ్వరరావు, లెక్చరర్స్ ప్రసాదరావు, వెంకట్రావు, పల్లవి, శివ, స్వప్న అభినందించారు.

ఖోఖో పోటీల్లో 'ప్రకాశం' జట్లకు గోల్డ్‌మెడల్

ప్రజాశక్తి-పంగులూరు

ఈ నెల 9, 10, 11 తేదీలలో కర్నూలు జిల్లా, ఆత్మకూరులో జరిగిన 41 వ జూనియర్ బాలుర బాలికల ఖోఖో పోటీలలో ప్రకాశం జిల్లా బాలుర, బాలికల జట్లు ప్రథమ స్థానంలో గెలుపొంది.. గోల్డ్ మెడల్ సాధించాయి. ఈ పోటీల్లో చివరి రోజైన ఆదివారం నాడు విశాఖపట్నం జిల్లా బాలుర, బాలికల జట్లతో జరిగిన హెూరాహెూరీ పోటీలో ప్రకాశం జిల్లా బాలుర, బాలికల జట్లు విజయం సాధించినట్లు ఖోఖో అసోసియేషన్ రాష్ట్ర కార్యదర్శి మేకల సీతారామరెడ్డి తెలిపారు. ఈ రెండు జట్లూ గోల్డ్ మెడల్ అందుకున్నాయన్నారు. రాష్ట్ర స్థాయిలో జిల్లా జట్లు విజయం సాధించటం పట్ల రాష్ట్ర ఖోఖో అసోసియేషన్ అధ్యక్షులు బాచిన చెంచుగరటయ్య, రాష్ట్ర కార్యదర్శి మేకల సీతారామిరెడ్డి, జిల్లా కార్యదర్శి కాశీ విశ్వనాథరెడ్డి ఆనందం వ్యక్తం చేశారు.



విజయం సాధించిన ప్రకాశం బాలుర, బాలికల జట్లు

వ్య.కా.స రాష్ట్ర కార్యదర్శిగా ఆంజనేయులు ఎన్నిక

ప్రజాశక్తి-ఒంగోలు కలెక్టరేట్



ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర కార్యదర్శిగా కంకణాల ఆంజనేయులు ఎన్నికయ్యారు. ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర మహాసభలు జంగారెడ్డిగూడెంలో ఆదివారం ముగిశాయి. సంఘం రాష్ట్ర నూతన అధ్యక్షులుగా దడాల సుబ్బారావు, ప్రధాన కార్యదర్శిగా వి వెంకటేశ్వర్లు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ప్రకాశం జిల్లా కార్యదర్శి కంకణాల ఆంజనేయులు రాష్ట్ర కార్యదర్శిగా, నెరుసుల వెంకటేశ్వర్లు, ఊసా వెంకటేశ్వర్లు, కెజి మస్తాన్ రాష్ట్ర కమిటీ సభ్యులుగా ఎన్నికయ్యారు.

పొంగిపొర్లుతున్న వాగులు

ప్రజాశక్తి-వెలిగండ్ల

మాండూస్ తుపాను వల్ల శుక్రవారం సాయంత్రం నుంచి కురుస్తున్న భారీ వర్షాలకు వెలిగండ్ల మండలంలోని వాగులు వంకలు పొంగిపొర్లుతున్నాయి. మండలంలోని నరసమాంబపురం వాగు, గన్నవరం బ్రిడ్జి దగ్గర వాగు పొంగి పొర్లడంతో ఆ గ్రామాలకు చెందిన వారి రాకపోకలు పూర్తిగా నిలిచిపోయాయి. గన్నవరం బ్రిడ్జి గోడలు లేపి.. పైస్లాబు ఆగిపోవడంతో గన్నవరం, చెన్నంపల్లి, గండ్లోపల్లి గ్రామస్తులు దాదాపు 12 ఏళ్ల నుండి ఈ సమస్యను ఎదుర్కొంటున్నారు.

ఇక ఆన్‌లైన్‌లో డ్వాక్రా ఉత్పత్తులు

- స్వయం సహాయక సంఘాల అభివృద్ధే ధ్యేయం
- వైఎస్ఆర్ సున్నా వడ్డీ రుణాలు అందజేత
- ప్రధాని స్వానిధి అమలుకు చర్యలు
- మెప్మా పీడీ రవికుమార్ వెల్లడి

ప్రజాశక్తి-ఒంగోలు కలెక్టరేట్

పట్టణ ప్రాంతాల్లో స్వయంసహాయక సంఘాల అభివద్ధే లక్ష్యంగా పనిచేస్తున్నామని పట్టణ పేదరిక నిర్మూలన సంస్థ (మెప్మా) ప్రాజెక్ట్ డైరెక్టర్ తేళ్ళ రవికుమార్ పేర్కొన్నారు. వైఎస్ఆర్ సున్నా వడ్డీ రుణాలు అందజేసేందుకు చర్యలు చేపట్టామన్నారు. స్వశక్తి సంఘాలు ఆర్థికంగా మరింత బలోపేతం కావటానికి వారు తయారు చేసిన ఉత్పత్తులను ఆన్‌లైన్‌లో విక్రయించేందుకు కృషి చేస్తున్నామన్నారు. మెప్మా ద్వారా చేపడుతున్న అభివద్ధి. సంక్షేమ కార్యక్రమాలను ప్రాజెక్ట్ డైరెక్టర్ రవికుమార్ ప్రజాశక్తికి వివరించారు.

జిల్లాలో మెప్మా పరిధిలో 11,746 స్వయం సహాయక సంఘాలు ఉన్నాయి. ఏరియా లెవల్ ఫెడరేషన్లు 449 ఉన్నాయి. ఏరియా లెవల్ ఫెడరేషన్లో 25 సంఘాలు తగ్గకుండా ఉండాలి. వీరికి రీసోర్సుపర్సన్ ఇన్‌చార్జిగా ఉంటారు. టౌన్ లెవల్ ఫెడరేషన్లు అయిన చీరాల, ఒంగోలు, కందుకూరు మార్కాపురంలో టౌన్ మెషీన్ మేనేజర్స్ పర్యవేక్షిస్తుంటారు. ఇనిస్టిట్యూషన్ బిల్డింగ్, జీవనోపాధుల కల్పన, బ్యాంక్ లింకేజీ, సామాజిక భద్రత వంటి అంశాలను పర్యవేక్షించేందుకు నలుగురు ఎక్స్ పర్ట్స్ పనిచేస్తున్నారు. వైఎస్ఆర్ ఆసరా, వైఎస్ఆర్ బీమా వంటి పథకాలు అమలు చేస్తున్నాం

వైఎస్ఆర్ సున్నా వడ్డీ అమలు

స్వశక్తి సంఘాలు ఆర్థికంగా బలోపేతం కావటానికి వైఎస్ఆర్ సున్నా వడ్డీ రుణాలు అందిస్తున్నాం. గత రెండు దశాబ్దాలుగా స్వయం సహాయక సంఘాలు ఉత్పాదక కార్యక్రమాలతో ఒక్కో సంఘం రూ.20 లక్షల వరకు రుణ సదుపాయం పొందుతోంది. తద్వారా స్వయం సంవృద్ధి సాధించటానికి ఈ రుణాలు దోహదపడుతున్నాయి. వైఎస్ఆర్ సున్నా వడ్డీ అమలు ద్వారా ఎన్నో విజయవంతమైన గ్రూపులు జిల్లాలో ఉన్నాయి.

వాష్‌పై అవగాహన కార్యక్రమాలు

వాష్(వాటర్ శానిటేషన్ హైజీన్) తాగునీటి వినియోగం, పారిశుధ్యం, పరిశుభ్రత అంశాలపై స్వయం సహాయక సంఘాలలో అవగాహన కార్యక్రమాలు చేపడుతున్నాం. దైనందిన కార్యక్రమాలతో ఇవి ముడి ఉండటంతో సంఘాల మహిళలు, వారి కుటుంబ సభ్యులకు ఈ విషయమై మరింత అవగాహన కల్పిస్తున్నాం. అదేవిధంగా జగనన్న స్వచ్ఛ సంకల్పం 100 శాతం అమలు చర్యలు చేపట్టాం.



ఆన్‌లైన్‌లో డ్వాక్రా ఉత్పత్తులు

పట్టణ ప్రాంతాలలో స్వయం సహాయక సంఘాలు తయారు చేసిన డ్వాక్రా ఉత్పత్తులను ఆన్‌లైన్‌లో విక్రయించేందుకు చర్యలు చేపట్టాం. ఇందు కోసం మెప్మా రాష్ట్ర అధికారులు డిస్ట్రిక్ట్ రిసోర్స్‌పర్సన్‌ను నియిమించారు. ఆయా ఆన్‌లైన్ సంస్థలు గుర్తించిన 56 రకాల డ్వాక్రా ఉత్పత్తులను ఆన్‌లైన్‌లో ఉంచి విక్రయానికి చర్యలు చేపట్టాం. ఒంగోలు నగరంలోని మెప్మా కార్యాలయంలో సెల్లార్ పాయింట్‌ను ఏర్పాటు చేశాం. త్వరలోనే డ్వాక్రా ఉత్పత్తులు ఆన్‌లైన్ విక్రయాలు ప్రారంభం కానున్నాయి.

పిఎం స్వానిధి అమలుకు చర్యలు

వీధి వ్యాపారులను ఆదుకునేందుకు వీలుగా ప్రధాన మంత్రి స్వానిధి పథకాన్ని మెప్మా ద్వారా అమలు చేస్తున్నాం. కరోనా కష్ట కాలంలో వీధి వ్యాపారులకు కేంద్ర ప్రభుత్వం రూ.10 వేల ఆర్థిక సహాయం అందిస్తోంది. గత రెండు విడతలుగా వీధి వ్యాపారుల ఖాతాలలో నగదు జమ చేశాం. మూడో విడతలో జిల్లాలోని అన్ని మున్సిపాలిటీలలో వీధి వ్యాపారులను రిజిస్ట్రేషన్ చేసుకుంటున్నాం. అదేవిధంగా సోషియా ఎకనామిక్ సర్వే చేపట్టి 8 రకాల పథకాలు 100 శాతం అమలు చర్యలు చేపట్టనున్నాం.

టిడ్కో రుణాలు మంజూరుకు చర్యలు

నవరత్నాలు పేదలందరికీ ఇళ్ల పథకంలో మెప్మా ద్వారా అర్హులకు టిడ్కో రుణాలు అందజేసేందుకు చర్యలు చేపట్టాం. ఇప్పటికే 25 శాతం మందికి రుణాలు మంజూరు కాగా ఆర్థిక చివరు నాటికి 100 శాతం రుణాలు ఇప్పిస్తాం. జగనన్న కాలనీలలో స్థలం ఉన్న స్వయం సహాయక సంఘాల సభ్యులకు రూ.35 వేలు రుణం ఇవ్వటంతో పాటు ఆర్థికంగా నిర్మాణం ఆగిపోతే వారిని ఆదుకునేందుకు చర్యలు చేపట్టాం. రానున్న కాలంలో 100 శాతం ఈ ప్రక్రియను పూర్తి చేస్తాం.